

3 నుంచి మహిళా పారిశ్రామిక మేళా

బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహిళా పారిశ్రామిక మేళాకు ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. డిసెంబరు 3నుంచి రెండురోజులపాటు ఎంటర్‌ప్రెన్యూర్ నారీ మేళా 2.0 పేరిట మహిళా పారిశ్రామికవేత్తల సదస్సు జరగనుంది. నవ్యనవేలి నందాస్ ప్రాజెక్టు ఏర్పాట్లు పర్యవేక్షిస్తోంది. వైట్‌ఫీల్డ్‌లోని కేటీపీఓ మైదానంలో 70మందికిపైగా మహిళా పారిశ్రామికవేత్తలు ఉమెన్ లీడ్‌బ్రాండ్ పాల్గొననున్నారు. మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్ మేళాను ప్రారంభిస్తారని యాస్పైర్ ఫౌండర్ సీఈఓ మధురదాస్ గుప్త సిన్హా తెలిపారు.


మీడియా సమావేశానికి కలసి వస్తున్న సీఎం, డీసీఎం

కనువిందు..!

- కలిసున్నామని చెప్పడానికే బ్రేక్ ఫాస్ట్ మీటింగ్
- నిన్న ఒకే వేదికపై... నేడు మీడియా ముందు
- అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అన్న సీఎం
- కొనసాగుతున్న గ్రూపు సమావేశాలు..చర్చలు
- ఢిల్లీలో ఖర్గేతో ఆ ముగ్గురి ప్రత్యేక భేటీ

బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ సమైక్య రాగం పాడారు. తామిద్దరమూ కలిసే ఉన్నామని మీడియా ముందు ఫొటోలు దిగుతూ కనువిందు చేశారు. అయితే అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్ అంటూ మరో సందేశం సీఎం చేరవేశారు. రాష్ట్రంలో రాజకీయ సంక్షోభానికి బ్రేక్-ఫాస్ట్ మీటింగ్ ఎటువంటి దిశానిర్దేశం చేయకపోయినా సమైక్య సందేశం వచ్చింది. సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచించారని అల్పాహార విందులో పాల్గొన్నారు. వారిద్దరి కలయికలో పెద్ద వ్యత్యాసం ఏమీ లేదు. శుక్రవారం బెంగళూరు ప్యాలెస్ మైదానంలో అంగన్‌వాడీ వ్యవస్థ ఏర్పాటై 50ఏళ్లు పూర్తైన సందర్భంగా జరిగిన సభలో సుమారు రెండు గంటలపాటు కలిసే పాల్గొన్నారు. శనివారం సీఎం సిద్దరామయ్య అధికారిక నివాసంలో 40 నిమిషాలపాటు విందులో కలసి పాల్గొన్నారు. ఇందులో ప్రత్యేకత ఏమీ లేకపోయినా గ్రూపు విభేదాలు తారస్థాయికి చేరితే కులాల మధ్య విభేధాలు, వాగ్వాదాలు సాగుతాయని ఎమ్మెల్యేలు, మంత్రులు ఎవరికివారుగా మద్దతు ఇచ్చేందుకు ముందుకెళ్తారని కార్యకర్తలలో అయోమయం నెలకొంటుందని అధిష్ఠానం హెచ్చరించింది. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ సూచించడంతో సీఎం సిద్దరామయ్య నేరుగా ఫోన్ చేసి డీసీఎం డీకే శివకుమార్‌ను అల్పాహార విందుకు ఆహ్వానించారు. అందుకు డీసీఎం కూడా సానుకూలంగా స్పందించారు. అనుకున్నట్లే అంతా జరిగింది. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ తర్వాత ఇద్దరూ మీడియా ముందుకు వచ్చారు. తామిద్దరూ కలిసే ఉన్నామని, అధిష్ఠానం ఆదేశాలకు కట్టుబడతామని మా సంబంధం బాగుందని, 2028 ఎన్నికల్లోనూ ఇదే తరహాలోనే పనిచేస్తామన్నారు. ఢిల్లీనుంచి పిలుపు వస్తే వెళ్తామన్నారు. 40 నిమిషాల విందు సమావేశం, 10 నిమిషాలు మీడియాకు వివరణతో ముగిసిపోయింది.

డీసీఎం టెంపుల్ రన్

సీఎంతో అల్పాహార విందు ముగియగానే డీసీఎం డీకే శివకుమార్ మండ్య జిల్లా కేఆర్ పేట తాలూకా కల్లహళ్ళిలోని భూవరాహ ఆలయానికి వెళ్లారు. అక్కడ హోమాల్లో పాల్గొన్నారు. అనంతరం దైవదర్శనం చేసుకున్నారు. ఇక మైసూరులో డీకే శివకుమార్ సీఎం కావాలని బైక్ ర్యాలీ జరిగింది. మరోవైపు కొత్తగా పరమేశ్వర్ సీఎం కావాలంటూ బెంగళూరు దొమ్మలూరు ప్రాంతంలోని ఓ ఆలయంలో ఆయన అనుచరులు పొర్లుదండాలు చేశారు. ఇలా ఎవరి అభిమానాన్ని వారు చాటుకుంటూ తగ్గేదేలే అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. అవకాశం వచ్చినప్పుడే తమ ప్రాబల్యాన్ని చాటుకోవాలని చూస్తున్నారు. తమ నేతకే అవకాశం ఇవ్వాలని జోరుగా డిమాండ్ చేస్తున్నారు. అయితే అధిష్టానం నిర్ణయం ఏమిటన్న దానిపైనే అందరి దృష్టి నెలకొంది. శీతాకాల సమావేశాల్లోగా తేలనుందో లేదో మరి.


బీజేపీ-జేడీఎస్ సమన్వయ సమావేశంలో కేంద్రమంత్రి కుమారస్వామి, ప్రతిపక్షనేతలు అశోక్, చలవాది నారాయణస్వామి

20 రోజులు తప్పనిసరి

- బెళగావిలో నామమాత్రపు సమావేశాలు సరికాదు
- బీజేపీ-జేడీఎస్ సమావేశంలో ప్రతిపక్ష నేత అశోక్

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాలు నామమాత్రంగా జరపడం సరికాదని, కనీసం 20రోజులు కొనసాగించాలని ప్రతిపక్షనేత అశోక్ డిమాండ్ చేశారు. బెంగళూరులో శనివారం ఓ హోటల్‌లో బీజేపీ-జేడీఎస్ పార్టీల సమన్వయ సమావేశం జరిగింది. ప్రతిపక్షనేత అశోక్, కేంద్రమంత్రి కుమారస్వామి, పరిషత్ ప్రతిపక్షనేత చలవాది నారాయణస్వామి, ఇరు పార్టీల ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ బెళగావిలో కేవలం 8 రోజులు మాత్రమే కలాపాలు జరుగుతాయన్నారు. తొలిరోజు సంతాపాలకే సరిపోతుందన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఉత్తరకర్ణాటక సమస్యలపై ప్రాధాన్యత ఇవ్వడంలో విఫలమైందన్నారు. తుంగభద్ర డ్యాం క్రస్ట్‌గేటు కొట్టుకుపోయి పునఃనిర్మించేందుకు అయిన రూ.12కోట్లు ఇంకా విడుదల చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో 60శాతం కమీషన్ సాగుతోందని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై కలసికట్టుగా పోరాటం చేద్దామని తీర్మానించారు. సమావేశంలో జేడీఎస్ నాయకులు రేవణ్ణ, నిఖిల్ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ నేతలు ఎప్పుడు తేలుస్తారో...?

సీఎం, డీసీఎంలు గడిచిన వారం పదిరోజులుగా అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడతామని, రోజుకు నాలుగైదుసార్లు మీడియాముందు ప్రకటిస్తూనే ఉన్నారు. ఒక్కోసారి విసుగుతో ఎన్నిసార్లు ఒకే విషయాన్ని చెప్పాలంటూ ఇద్దరూ విసుక్కున్నారు. సీఎం సిద్దరామయ్య తానే ఐదేళ్లు సీఎంగా ఉంటానని, వచ్చే బడ్జెట్ కూడా ప్రవేశపెడతానని బహిరంగంగా ప్రకటించారు. కానీ డీసీఎం డీకే శివకుమార్ తనకు ఏ విషయంలోనూ ఆత్రుత లేదని అధిష్ఠానం చూసుకుంటుందన్నారు. ఐదేళ్లు నేనే సీఎం, బడ్జెట్ ప్రవేశపెడతానంటూ చేసిన సీఎం వ్యాఖ్యలపైనా డీసీఎం లౌక్యంగా మాట్లాడారు. సిద్దరామయ్య ఎలా చెబితే అలాగే, ఆయన పెద్ద వారంటూ తప్పించుకున్నారు. సీఎం, డీసీఎం ముఖ్యమంత్రి పదవిని దక్కించుకునేందుకు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారనడంలో సందేహం లేదు. చేతిదాకా వచ్చింది ఎలా వదులుకోవాలని డీసీఎం ఎత్తులు వేస్తున్నారు. ఇక ఇదే చివరి అవకాశం, వదులుకుంటే భవిష్యత్తు ఉండదని సిద్దరామయ్యతో పాటు ఆయన వర్గీయులు భావిస్తున్నారు. ఇద్దరికీ కులసంఘాలు, స్వామీజీల మద్దతు కూడా జోరందుకుంది. ఇంత జరుగుతున్నా ఢిల్లీ నేతలు మాత్రం ఎటూ తేల్చకుండానే ఉన్నారు. సోమవారం నుంచి లోక్‌సభ సమావేశాలు జరగనున్నాయి. దీంతో రాహుల్‌గాంధీ సహా అగ్రనేతలు బిజీ అవుతారు. మరో వారంలో రాష్ట్ర శాసనసభ శీతాకాల సమావేశాలు బెళగావిలో ప్రారంభం అవుతాయి. ఈలోగానే వివాదాలకు చరమగీతం పాడాలని అధిష్ఠానం యోచిస్తోంది.


సీఎం, డీసీఎంతో కొడగు ఎమ్మెల్యే పొన్నణ్ణ

ముగ్గురు యువనేతలకు ప్రాధాన్యం

బెంగళూరులో సీఎం, డీసీఎంల సభకు ముందుగా ఢిల్లీలో పలు కీలక చర్చలు సాగాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఆయన కుమారుడు, రాష్ట్ర మంత్రి ప్రియాంకఖర్గే, హొస్కోటె ఎమ్మెల్యే శరత్‌బచ్చేగౌడలు భేటీ అయ్యారు. వారు సుదీర్ఘంగా చర్చలు జరిపారు. వారం ప్రారంభంలో ప్రియాంక ఖర్గే ఢిల్లీలో రాహుల్‌గాంధీని కలసి తాజా పరిస్థితులను వివరించారు. రాహుల్ సందేశాన్ని బెంగళూరుకు వచ్చి సీఎం, డీసీఎంలకు వివరించారు. మరో యువనేత శరత్‌బచ్చేగౌడ ఢిల్లీలో కీలకభేటీలలో భాగస్వామ్యులవుతున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడితోపాటు పలువురితో కలసి తాజా పరిస్థితులను వివరించిన విషయం తెలిసిందే. రెండురోజులక్రిందట ఢిల్లీ వెళ్లిన కొడగు జిల్లా ఎమ్మెల్యే, సీఎం న్యాయసలహాదారుడు పొన్నణ్ణ, కేసీ వేణుగోపాల్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఆయన సూచించిన మేరకే అల్పాహార విందుభేటీ జరిగినట్లు తెలుస్తోంది. సీఎం సిద్దరామయ్య అధికారిక నివాసంలో ఒకరిద్దరు ఉద్యోగులు మినహా మిగిలిన ఎవరినీ లోపలికి రానివ్వకుండా ముందుగానే సూచించారు. కానీ సీఎం, డీసీఎంలు కలసినప్పుడు పొన్నణ్ణ మాత్రం కాసేపు అక్కడే ఉన్నారు. ఈ ముగ్గురు యువనేతలు ఇటు రాష్ట్ర, అటు అగ్రనేతలకు వారధులుగా పనిచేస్తున్నారు. డీసీఎం డీకే శివకుమార్ తమ్ముడు డీకే సురేశ్ ఢిల్లీలోనే గడుపుతున్నారు.


యోగా విన్యాసాలు ప్రదర్శిస్తున్న సిరి

అంతర్జాతీయ యోగా పోటీలకు సిరి

- 16 నుంచి కౌలాలంపూర్‌లో..
- అద్భుత ప్రతిభతో ఆకట్టుకుంటున్న చింతామణి బాలిక

-వివరాలు7లో

కుమార్తెకు కిడ్నీ దానం చేసిన తండ్రి

30 కిలోల గంజాయి స్వాధీనం

శీతాకాల సమావేశాల తర్వాత మంత్రివర్గ విస్తరణ

- కోలారు జిల్లాకు పదవి ఖాయం
- ఎమ్మెల్యే నారాయణ స్వామి జోస్యం

ఘనంగా కన్నడ రాజ్యోత్సవం

● వివరాలు 7లో

తెల్లారిన జీవితాలు

- కర్నూలు జిల్లా కోటేకల్లు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- మలుపు వద్ద రెండు కార్లు ఢీ
- కోలారు జిల్లా వాసులు ఐదుగురు దుర్మరణం
- ఇద్దరు చిన్నారులు, ఇద్దరు మహిళలు
- మంత్రాలయం శ్రీమఠానికి వెళ్తుండగా ఘటన



ఉన్నత చదువులు.. మంచి ఉద్యోగాలు.. ప్రేమకు ప్రతిరూపంగా ముద్దులొలికే బాలుడు. ఆ అందమైన కుటుంబాన్ని చూసి విధికి కన్ను కుట్టింది. రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాన్ని చిన్నాభిన్నం చేసేసింది. సాఫీగా సాగిపోతున్న వారి జీవితంలో అనుకోని ఘటన తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రాత్రంతా సాగిన వారి కారు ప్రయాణం మరో గంటలో గమ్యస్థానానికి చేరుకునేది. అంతలోనే విధి వారిని వంచించింది. రోడ్డు ప్రమాదం రూపంలో ఐదుగురిని బలితీసుకుంది. భార్యతో పాటు తండ్రి గుండెలపై నిద్రించిన కొడుకు ఇద్దరూ కానరాని లోకాలకు వెళ్లిపోయారు. వెనుకసీట్లో ఉన్న మరో ముగ్గురు కన్నుమూశారు. ఈ విషాద సంఘటన కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు మండలం కోటేకల్లు వద్ద శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు దుర్మరణం పాలయ్యారు.


బాలుడి మృతదేహంతో..


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు


సతీశ్ వెంకటేశప్ప మీనాక్షి చిన్నారులు (ఫైల్)

ఎమ్మిగనూరు/ ఆదోని రూరల్/బంగారుపేట, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం కోలార్‌జిల్లా మాలూరు తాలుకా నెల్లల్లి గ్రామానికి చెందిన కిష్టప్ప, సరస్వతమ్మలకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరిలో పెద్దకుమారుడు సతీష్(34)కు ఎనిమిదేళ్ల క్రితం బంగారుపేట తాలుకా, చిక్కహోసల్లి గ్రామానికి చెందిన వెంకటేషప్ప(72), గంగమ్మల కుమార్తె మీనాక్షి(32)తో వివాహం జరిగింది. వీరిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా బెంగళూరులో స్థిరపడ్డారు. వీరికి రిత్విక్(4) కుమారుడు సంతానం. ఇటీవల సతీష్ బెంగళూరు పట్టణంలో ఓ ఇంటిని కొనుగోలు చేశాడు. 15 రోజుల క్రితం సొంత గ్రామమైన నెల్లల్లికి చేరుకున్నారు. ఈనెల 27వ తేదీన వారు కుటుంబ సభ్యులతో కలిసి పెళ్లి రోజును ఘనంగా జరుపుకున్నారు. అలాగే మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శించుకోవాలనే మొక్కుబడిలో భాగంగా సతీష్ దంపతులు, అత్తమామలతో కలిసి మంత్రాలయం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం రాత్రి నెల్లల్లి గ్రామం నుంచి తన తమ్ముడు సుధాకర్ కారులో మిత్రుడు చేతన్ (డ్రైవర్)తో కలిసి రాత్రి 8గంటల సమయంలో అత్తమామ గ్రామమైన చిక్కహళ్లికి చేరుకున్నారు. అక్కడ అత్త, మామలు వెంకటేషప్ప, గంగమ్మ, వెంకటేషప్ప మనవడు బనిత్‌గౌడ్(5)ను ఎక్కించుకొని రాత్రి 10గంటల సమయంలో మంత్రాలయానికి బయల్దేరారు. వీరు ప్రయాణిస్తున్న కేఏ07బి 9672 నంబర్‌గల షిఫ్ట్ డిజైర్ కారు శనివారం తెల్లవారుజామున 4:20 గంటల సమయంలో ఆదోని మండలం ఆరెకల్లు, ఎమ్మిగనూరు మండలం కొటేకల్లు మధ్యలో ఎన్‌హెచ్ 167 జాతీయ రహదారిలో ఉన్న మలుపు వద్దకు చేరుకుంది. అక్కడ ఎదురుగా ఆదోని వైపునకు వస్తున్న ఏపీ39 ఎస్‌ఎ౯2020 నంబర్ గల ఫార్చునర్ కారు ఒకటికొకటి వేగంగా ఢీకొన్నాయి. ఈ ఘోర ప్రమాదంలో దంపతులు సతీష్ కుమార్, మీనాక్షి, వారి కుమారుడు రిత్విక్‌తో పాటు మీనాక్షి తండ్రి వెంకటేషప్ప, మేనల్లుడు బనిత్‌గౌడ్‌లు కారులోనే ఇరుక్కొని మృత్యువాత పడ్డారు. మీనాక్షి తల్లి గంగమ్మ, డ్రైవింగ్ చేస్తున్న చేతన్‌లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. అలాగే ఫార్చునర్ కారులో ప్రయాణిస్తున్న అశోక్, జాహ్నవి, రాధికతో పాటు డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని హుటాహుటిన ఆదోనిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన గంగమ్మ, చేతన్‌లను మెరుగైన (మిగతా 9వ పేజీలో)

రూపు మారనున్న మెజెస్టిక్

- ఆధునికీకరణకు ప్రభుత్వం నిర్ణయం ● రూ.1500 కోట్లతో విస్తరణ పనులు
- 32 ఎకరాల్లో టెర్మినల్ ● జనవరి నాటికి డీపీఆర్ ● పీపీపీ పద్ధతిన గురుగ్రామ్ సంస్థకు అప్పగింత


మెజెస్టిక్ బస్టాండ్ విహంగవీక్షణం

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మెజెస్టిక్ అంటే రాష్ట్రంలోని 6కోట్ల మందికే కాదు బెంగళూరుతో సంబంధాలు కల్గిన ప్రతి ఒక్కరికీ గుర్తుండే ప్రదేశం. మూడు దశాబ్దాలక్రిందటే మెజెస్టిక్ బస్టాండ్‌ను ప్రత్యేకత అనిపించేలా నిర్మించారు. బహుశా దేశంలో ఒకే చోటు నుంచి సిటీ బస్సులు, స్టేట్ సర్వీసులు, ఇంటర్‌స్టేట్ బస్సులు, రైళ్ళు, మెట్రో సేవలతోపాటు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు ప్రతి 10నిమిషాలకోసం బస్సు సదుపాయం ఎక్కడా ఉండదు. నగరంలోని ఏ ప్రాంతానికైనా వెళ్లేందుకు వీలుగా బీఎంటీసీ బస్టాండ్ ప్రత్యేకంగా ఉంటుంది. మరోవైపు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు వెళ్లే కేఎస్ఆర్టీసీ బస్సులు ఇదే ప్రాంతంనుంచే రాకపోకలు సాగిస్తాయి. ఇక ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన వందలాది బస్సు సర్వీసులు ఇక్కడనుంచే ప్రారంభమవుతాయి. ఇదంతా బస్సులకు సంబంధించిన అంశం. మెజిస్టిక్ రోడ్డు దాటితే బెంగళూరు సిటీ రైల్వేస్టేషన్ ఉంది. క్రాంతివీర సంగొళ్ళిరాయణ్ణ (కేఎస్ఆర్) రైల్వేస్టేషన్‌కు ప్రత్యేకత ఉంది. దేశంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ రైళ్లు ఇక్కడనుంచే బయల్దేరుతాయి. ఇలా రోజుకు వందలాది రైళ్లు వచ్చిపోతుంటాయి.

రోజూ లక్షమంది రాకపోకలు

ఒకప్పుడు వేలమందికి అనుకూలంగా ఉండేలా నిర్మించిన మెజస్టిక్ ప్రదేశం ప్రస్తుతం రోజూ లక్షలాదిమంది రవాణాకు హృదయభాగంగా ఉంది. బీఎంటీసీ బస్సుల సంఖ్య పెరిగింది. అందుకు తగ్గట్టుగానే పొరుగు రాష్ట్రాలకు వెళ్లే బస్సులు ప్రయాణీకుల డిమాండ్‌ను బట్టి పెరుగుతున్నాయి. మెట్రో రైళ్ల కోసం వచ్చేవారి సంఖ్య అధికమవుతోంది. వీటన్నింటికంటే రైల్వేస్టేషన్‌ను వినియోగించుకునేవారే ప్రతిరోజూ లక్షలాదిమంది ఉంటారు. ఇలా మెజస్టిక్‌పై రద్దీ ప్రభావం పెరగడంతో రూపురేఖలు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రూ.1500 కోట్లతో పునఃనిర్మించాలని ఓ ప్రాజెక్టును సిద్ధం చేస్తున్నారు. కేఎస్ఆర్టీసీ 2025-26 రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా రూ.6.5 కోట్లతో డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు గురుగ్రామ్ కు చెందిన రిసర్జెంట్ ఇండియా లిమిటెడ్‌కు ఈనెల 14న అప్పగించారు. సంస్థ పీపీపీ పద్ధతిన భూ వినియోగం, ట్రాఫిక్ డిమాండ్‌తోపాటు వాణిజ్య పరమైన అభివృద్ధికోసం అధ్యయనం చేస్తోంది. 2026 జనవరి చివరినాటికి నివేదికను సమర్పించేందుకు అవకాశం ఉంది. సదరు నివేదికను మంత్రివర్గం ఆమోదిస్తే 2026 సంవత్సరంలో టెండర్లను పిలిచేందుకు కేఎస్ఆర్టీసీ సిద్ధం కానుంది. ఈ ప్రాజెక్టు ప్రారంభమైతే బీఎంటీసీ, కేఎస్ఆర్టీసీ బస్టాండ్లను తొలగిస్తారు. 32 ఎకరాల భూమిలో కొత్త టర్మినల్‌ను వాణిజ్యకేంద్రంగాను నిర్మిస్తారు. ఇందుకు సంబంధించి కేఎస్ఆర్టీసీ ఎండీ అక్రమ్‌పాషా తెలిపిన మేరకు రూ.1500 కోట్లతో ప్రాజెక్టు నిర్మించదలిచామన్నారు. అయితే ఇది ఇంకా ప్రాథమికదశలోనే ఉందని డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు వచ్చాకనే ఒకదశకు చేరుతుందన్నారు. అయితే అత్యాధునిక పరికరాలతో త్వరగా పనులు పూర్తి చేస్తామన్నారు.

రైల్వే ట్రాఫిక్‌ను సమతుల్యం చేసేందుకు స్పెషల్ రైళ్లను యశ్వంతపుర, యలహంక, బయ్యప్పనహళ్ళిలనుంచి వెళ్లేలా ఏర్పాటు చేస్తున్నారు. ఈ మూడు స్టేషన్లకు మెజెస్టిక్ నుంచి వెళ్లేందుకు బస్సు, రైలు మార్గాలు ఉన్నాయి. కాగా ఇటీవలే మెట్రో రైలు కూడా మెజెస్టిక్ నుంచి అందుబాటులోకి వచ్చింది. నగరానికి నాలుగువైపులా వెళ్లేందుకు మెజిస్టిక్ మెట్రో స్టేషన్ పనిచేస్తుంది. ఇటు వైట్‌ఫీల్డ్, మైసూరు రోడ్డు, తుమకూరు రోడ్డు, కనకపుర రోడ్లవైపు వెళ్లేందుకు మెట్రో స్టేషన్ జంక్షన్‌గా ఉంది. ఇలా ప్రతిరోజూ మెజస్టిక్ ప్రాంతానికి లక్షలాదిమంది ప్రయాణీకులు వస్తుంటారు.

రైల్వేస్టేషన్, మెజస్టిక్, మెట్రో స్టేషన్‌తోపాటు సబర్బన్ రైలు ఇంటర్‌చేంజ్, అనుబంధ ప్రదేశాల్లో కేఎస్ఆర్టీసీ, బీఎంటీసీ బస్టాండ్లకు సులభతరంగా చేరుకునేందుకు వ్యవస్థీకృతంగా నిర్మాణాలు చేపట్టాలని భావించారు. రోజూ లక్షలాదిమంది ప్రయాణీకులు ఈ ప్రదేశానికి వస్తున్నందున బహుళ అంతస్థుల వ్యాపార సముదాయాన్ని నిర్మించడంతోపాటు ఇంటర్‌చేంజ్ ప్రదేశంలో రిటైల్ షాపింగ్ హబ్‌లను నిర్మించాలని నిర్ణయించారు. సులభతరంగా ఏ ప్రదేశం నుంచి అయినా మెట్రో, బీఎంటీసీ, కేఎస్ఆర్టీసీ, రైల్వేస్టేషన్‌లకు చేరుకునేలా సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు. మెజస్టిక్‌లో 31,920 చదరపు మీటర్ల విస్తీర్ణంతో నగరంలోనే అతిపెద్ద బస్టాండ్‌ను నిర్మించాలని నిర్ణయించారు. ఒమిలియన్ చదరపు మీటర్లకంటే ఎక్కువ వాణిజ్య భవనాలను, అతిపెద్ద పార్కింగ్ సౌకర్యాలను కల్పించనున్నారు. రోజూ కేఎస్ఆర్టీసీ బస్సుల ద్వారా 80వేల నుంచి లక్షమందిదాకా ప్రయాణిస్తున్నారు. 2,660 బస్సులు ఇక్కడనుంచి రాకపోకలు సాగిస్తాయి. రద్దీనిబట్టి సర్వీసులు పెరిగే అవకాశం ఉంది. ఇక బీఎంటీసీ ప్రతిరోజూ 11వేలకుపైగా బస్సు సర్వీసులను నడుపుతోంది. 5లక్షలమంది అంతకంటే ఎక్కువగా ప్రయాణీకులకు అనుకూలంగా ఉంది. రైల్వేస్టేషన్, మెట్రో సర్వీసుల ద్వారాను వేలాదిమంది రాకపోకలు సాగిస్తారు. ఇంతమందికి అనుకూలమైన మెజస్టిక్ ప్రదేశాన్ని భవిష్యత్తు తరాల అవసరాలకు అనుగుణంగా ఉండేలా నిర్మించనున్నారు. అత్యాధునిక యంత్రాలతో పనులు చేపట్టనున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


హనుమంత రాయుడు (ఫైల్)

కుందుర్పి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన చాకలి హనుమంతరాయుడు (52) అప్పుల బాధతో శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు హనుమంతరాయుడుకు నాలుగెకరాల పొలం ఉంది. అందులో బోరుబావి తవ్వించి, మామిడిసాగు చేశాడు. ఇందుకోసం అప్పులు చేశారు. వాటిని తీర్చలేక పొలాన్ని సైతం బ్యాంకులో తాకట్టుపెట్టాడు. అప్పులు తీర్చేందుకు ఉపాధి కోసం ఏడాది కిందట భార్య అంజనమ్మ, కుమారుడు నవీన్‌తో కలిసి బెంగళూరుకు వలస వెళ్లాడు. వారం రోజుల కిందట బెంగళూరు నుంచి కుందుర్పికి వచ్చాడు. గతంలో ఈయన పెయింట్ పని చేసేవాడు. ఈ నేపథ్యంలో స్థానికంగా పెయింట్ పని దొరికిందని, దాన్ని ముగించుకుని వస్తానని బెంగళూరులోని కుటుంబ సభ్యులకు తెలిపాడు. పని ముగించుకుని శుక్రవారం ఇంటికి వచ్చాడు. ఒంటరిగా ఉండటంతో చేసిన అప్పులు గుర్తుకు వచ్చి, మథనపడుతూ ఇంటి పైకప్పునకు ఉరి వేసుకున్నాడు. చుట్టుపక్కల వారు శనివారం ఉదయం గమనించి కుటుంబ సభ్యులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మద్యానికి బానిసై..

బ్రహ్మసముద్రం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎరడికెర గ్రామానికి చెందిన రవి(30), మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. మద్యం సేవించేందుకు డబ్బులు కావాలని తన తండ్రి నాగరాజును శనివారం మధ్యాహ్నం అడిగాడని, తన వద్ద డబ్బులు లేవని ఆయన చెప్పడంతో ఇంట్లోకి వెళ్లి చీరతో ఉరివేసుకున్నాడని తెలిపారు. తండ్రి వెళ్లి చూసేసరికే మృతి చెందాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. రవికి భార్య గౌరమ్మ, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు.

బకెట్‌లో పడి బాలుడి మృతి

అనంతపురం క్రైం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ఆడుకుంటూ వెళ్లి నీటి బకెట్‌లో పడిన పసివాడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషాద సంఘటన అనంతపురం రాణి నగర్‌లో శనివారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన ఫల్జాజ్, షబ్రీన్ దంపతులకు మూడేళ్ల, 11 నెలల వయసున్న ఇద్దరు కుమారులు శుక్రవారం ఇంటి ముందు ఆటల్లో మునిగిపోయారు. చిన్న కుమారుడు మహ్మద్ ఆహిల్ దగ్గరల్లో ఉన్న నీటి బకెట్ వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో తల్లకిందులుగా పడిపోయాడు. బాలుడి తల్లి ఆలస్యంగా గుర్తించి, వెంటనే ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో చికిత్స అందించారు. బాలుడు కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం


వెంకటరమణ(ఫైల్)

పుట్లూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొండుగారికుంట గ్రామానికి చెందిన వల్లపు వెంకటరమణ(35) అదృశ్యమయ్యాడని పోలీసులు శనివారం తెలిపారు. ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం బహిర్భూమికి వెళుతున్నానని తన భార్యతో చెప్పి వెళ్లాడని, ఆ తరువాత తిరిగి రాలేదని తెలిపారు. వెంకటరమణ భార్య గీతాంజలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆనంద్‌ది ఆత్మహత్యే: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ రవిబాబు

కళ్యాణదుర్గం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆనంద్‌ది ఆత్మహత్యేనని డీఎస్పీ రవిబాబు విలేకరులకు శనివారం స్పష్టం చేశారు. ఈ నెల 21న కళ్యాణదుర్గం శివారులో ఆనంద్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఉద్యోగం రానందుకు జీవితంపై విరక్తి చెంది తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని తల్లిదండ్రులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆ తరువాత తమ కుమారుడి మరణంపై అనుమానాలు ఉన్నాయని, హత్య చేశారని ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో పూర్తిస్థాయిలో విచారించామని, పోస్టుమార్టం నివేదికను పరిశీలించామని అన్నారు. హత్య కోణంలో దర్యాప్తు చేశామని, ఆత్మహత్యే అని తేలిందని అన్నారు. ఈ కేసు విషయంలో ఎటువంటి రాజకీయ కోణాలు లేవని స్పష్టం చేశారు. ఇది హత్యేనని భావిస్తే తగిన ఆధారాలు, సాక్షాలను తమకు అందజేయాలని సూచించారు. పోలీసులపై బురద చల్లడం, పరువు హత్య అని ఆరోపణలు చేసేముందు వాస్తవాలు తెలుసుకోవాలని అన్నారు.

ఆర్డీటీ స్టేడియంలో రికీ కేజ్


ఆర్డీటీ విద్యార్థులతో రికీ కేజ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నగర శివారులోని ఆర్డీటీ స్టేడియాన్ని గ్రామీ, పద్మశ్రీ అవార్డు గ్రహీత రికీ కేజ్ శనివారం సందర్శించారు. ఆయనకు ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంచో ఫెర్రర్, మహిళా సాధికారత డైరెక్టర్ విశాలాఫెర్రర్ దంపతులు ఘనంగా స్వాగతం పలికారు. స్టేడియంలో క్రికెట్ గ్రౌండ్, వసతులను రికీ కేజ్ పరిశీలించి, అకాడమీలో పిల్లలతో సంభాషించారు. ఈ సందర్భంగా రికీ కేజ్ మాట్లాడుతూ ఆర్డీటీని సందర్శించడం చాలా సంతోషంగా ఉందని, ఆర్డీటీ క్రీడా మైదానం, ఆవరణలో అత్యాధునిక వసతులు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఆర్డీటీ ఇన్‌క్లూజివ్ హైస్కూల్ చాలా స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. మాంచో ఫెర్రర్ మాట్లాడుతూ రికీ కేజ్ ఆర్డీటీని సందర్శించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ పాల్గొన్నారు.

వైసీపీ నాయకుడికి రిమాండ్

టీడీపీ నాయకుడిపై దాడి ఫలితం


కోర్టు ఆవరణలో వైసీపీ నాయకుడు కృష్ణమూర్తి

అనంతపురం క్రైం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూడో డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకుడు, జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ బావ కృష్ణమూర్తికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. దీంతో పోలీసులు శనివారం ఆయన్ను అనంతపురం సబ్‌జైలుకు తరలించారు. ఇటీవల టీడీపీ నేతపై దాడికి సంబంధించిన కేసులో ఆయనను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి, కోర్టుకు హాజరుపరిచారు. ఈ నెల 21న 3వ డివిజన్‌లో తన భర్తపై వైసీపీ నాయకుడు కృష్ణమూర్తి, రాణినగర్‌కు చెందిన మరికొందరు దాడి చేశారని టీడీపీ నాయకుడు కురువ గోపాల్ భార్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

టీచర్లకు క్రీడాపోటీలు ప్రారంభం

అనంతపురం విద్య, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల క్రీడాపోటీలు మండలస్థాయిలో శనివారం ప్రారంభమయ్యాయి. ఎంఈఓల పర్యవేక్షణలో పురుషులకు క్రికెట్, మహిళలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. తొలిరోజు ఆయా మండలాలలోని వివిధ ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలకు చెందిన పురుష, మహిళా టీచర్లు మండల కేంద్రంలో జరిగిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గురువులు ఆడుతున్న ఆటలపోటీలను విద్యార్థులు తిలకిస్తూ కేరింతలు కొట్టారు. ఆదివారం కూడా పోటీలు కొనసాగనున్నాయి. ఇక్కడ విజేతలుగా నిలిచిన టీమ్‌లను డివిజన్ స్థాయి పోటీలకు, అక్కడా విజయం సాధిస్తే జిల్లా, ఆపై రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నారు.

తిరోగమనంలో టమోటా ధరలు

నాలుగురోజులుగా తగ్గు ముఖం

మందగించిన ఎగుమతులు

ఆందోళనలో అన్నదాతలు


మార్కెట్‌కు తరలించడానికి టమోటాలను సిద్ధం చేస్తున్న కూలీలు

అనంతపురంరూరల్/తనకల్లు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): టమోటా రైతుల ఆనందం వారం తిరక్కుండానే ఆవిరైపోతోంది. పది రోజుల క్రితం కిలో రూ.50 దాటిన టమోటా ధరలు రూ.34కు పడిపోయాయి. వెరసి టమోటా ధరలు అన్నదాతల జీవితాలతో ఆటడుకుంటున్నాయి. రెండు వారాల క్రితం ఓ మోస్తారుగా సాగాయి. తరువాత ఉన్నఫలంగా ధరలు పెరిగిపోయాయి. ఉమ్మడి జిల్లాలో కిలో గరిష్ట ధరలు రూ.50పైగా పలికాయి. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. స్థిరంగా సాగుతున్నాయనుకునేలోపు మళ్లీ తిరోగమనం పట్టాయి. మూడునాలుగురోజులు పతనం వైపు పయనిస్తున్నాయి. జిల్లా నుంచి ఎగుమతులు మందగించడంతో పరిస్థితులు తలకిందులయ్యాయి. తనకల్లు మండలంలో ఖరీఫ్, రబీ సీజన్లతో సంబంధంలేకుండా వేలాది ఎకరాల్లో రైతులు టమోటా సాగు చేస్తుంటారు. టమోటా సాగుచేయడానికి ఎకరానికి రూ.1.50 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో ధరలు నిలకడగా ఉంటే ఎకరాకు రూ.5నుంచి 10 లక్షల వరకు ఆదాయం వచ్చేది. రైతులు అన్నమయ్య జిల్లా ములకలచెరువు, అంగళ్లు, మదనపల్లి మార్కెట్లతో పాటు, కర్ణాటకలోని చింతామణి, వడ్డిపల్లి, కోలార్‌కు టమోటాలను తరలిస్తున్నారు.

గత పదిరోజులుగా టమోటా ధరలు ఇలా

తేది	గరిష్టం కిలో ధర రూ.	సరాసరి	కనిష్టం
20	50	37	27
21	52	37	30
22	47	30	24
23	47	30	24
24	51	37	27
25	49	37	27
26	46	30	24
27	40	27	20
28	37	24	14
29	34	20	14

మూడు రోజుల నుంచి పతనం

అనంతపురం నగరం సమీపంలోని కక్కలపల్లి, కళ్యాణదుర్గంలో టమోటా మార్కెట్లు నడుస్తున్నాయి. ఇప్పటికే కళ్యాణదుర్గంలో మండీలు బంద్ అయినట్లు మార్కెట్ వర్గాలు అంటున్నాయి. కక్కలపల్లి టమోటా మార్కెట్‌కు రోజూ 1800 నుంచి 2,300 టన్నుల వరకు వస్తున్నాయి. గతంలో కంటే ప్రస్తుతం దిగుబడులు మార్కెట్‌కు తక్కువగానే వస్తున్నాయి. పదిహేను రోజుల కిందట వరకు మేలిరకం కాయలు గరిష్టంగా కిలో రూ.20 నుంచి రూ.25 మధ్య పలికాయి. తరువాత అమాంతం పెరిగి కిలో రూ. 50తో అమ్ముడుపోయాయి. సరాసరి ధరలు రూ.35కిపైగా.. కనిష్ట ధరలు రూ.25తో పలికాయి. దీంతో రైతుల్లో ఆశలు చిగురించాయి. ఇంతలోనే పరిస్థితులు తలకిందులయ్యాయి. గడిచిన మూడునాలుగురోజుల్లో మార్కెట్‌లో ధరలు పరిశీలిస్తే ఇదే విషయం అర్థమవుతుంది.

మందగించిన ఎగుమతులు

ధరల తగ్గుదలకు కారణాలు లేకపోలేదు. మార్కెట్ నుంచి ఎగుమతులు మందగించడం ధరల్లో తగ్గుదలకు ప్రధాన కారణమన్న వాదనలు ఆయా వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. వాతావరణంలో నెలకొన్న మార్పులు మరోకారణంగా నిలుస్తున్నాయి. నాలుగైదురోజుల కిందట వరకు స్థానిక మార్కెట్ నుంచి ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర ప్రాంతాలకు ఎగుమతులు జరిగేవి. ఆయా ప్రాంతాల్లోని స్థానిక మార్కెట్లకు దిగుబడులు లేకపోవడంతో ఎగుమతులు ఆశాజనకంగా సాగాయి. ప్రస్తుతం ఎగుమతులు చాలా వరకు తగ్గిపోయినట్లు తెలుస్తోంది. స్థానిక మార్కెట్‌కు ఆయా ప్రాంతాల నుంచి దిగుబడులు వస్తున్నట్లు మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రస్తుతం కేవలం ఆంధ్ర, తమిళనాడు చుట్టుపక్కల ప్రాంతాలకు మాత్రమే ఇక్కడి నుంచి కాయలు ఎగుమతి అవుతున్నాయి.

ఉన్నట్లుండి మార్పులు..



నేను రెండు ఎకరాల్లో టమోటా పంటను సాగుచేశా. పది రోజులక్రితం వరకు టమోటాకు ధరలు లేవు. అడిగే ఆనాథుడే లేక అలాగే వదిలేశాం. ఉన్నట్లుండి ధరలు పెరగడంతో వదిలేసిన తోటకు మందులు పిచికారి చేసి, డ్రిప్ ఎరువులిచ్చి పంటను కాపాడుకున్నా. వారం రోజులపాటు 30 కిలోల బాక్స్ ధర రూ.1400, 1100, 900 పలికాయి. ప్రస్తుతం రూ.600 ధర పలుకుతున్నాయి. నాలుగైదు కోతలు మాత్రమే ధరలు పలికాయి. ప్రస్తుతం ప్రతిరోజూ ధరలు తగ్గిపోతున్నాయి. వాతావరణంలో మార్పుల వల్ల ఉన్నపంటల దెబ్బతింటున్నాయి.

\- సూరి, రైతు, పెద్దపల్లి, తనకల్లు మండలం

ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి

తనకల్లు మండలంలో సీజన్లతో సంబంధం లేకుండా వేలాది ఎకరాలో టమోటాలు సాగు చేస్తుంటారు. టమోటాకు ధరలు లేనప్పుడు పొలాల్లో వదిలేస్తున్నారు. నేను సీజన్‌తో సంబంధం లేకుండా టమోటా సాగుచేస్తున్నాను. ప్రస్తుతం ఎకరాలో టమోటా సాగుచేశా. టమోటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి. అవి ఉంటే టమోటాలకు గిట్టుబాటు ధరలు ఉంటాయి. ఇక్కడ పండించే టమోటాలతోనే ఈ ప్రాంతంలో ప్రాసెసింగ్ యూనిట్లు నడపవచ్చు.



\- సూర్యనారాయణ, రైతు, కొత్తకురవపల్లి

క్రీడలతో ఆత్మవిశ్వాసం: కలెక్టర్


పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్, చైర్మన్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): క్రీడాపోటీల్లో పాల్గొనడం ద్వారా విభిన్న ప్రతిభావంతులలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో నిర్వహించిన విభిన్న ప్రతిభావంతుల క్రీడాపోటీలను కలెక్టర్, విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ నారాయణస్వామి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ప్రభుత్వం అందించే రిజర్వేషన్లు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ అర్చన, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి, ఐసీడీఎస్ పీడీ అరుణకుమారి, డీఎస్‌డీఓ మంజుల, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా జాతీయ ఫుట్‌బాల్ పోటీలు

● నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో జాతీయ బాలికల ఫుట్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా నిర్వహించారు. గోవా-కేరళ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు కలెక్టర్ ఆనంద్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించడం సంతోషకరమని కలెక్టర్ తెలిపారు. పోటీల్లో 16జట్లు పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలి: కలెక్టర్

● **అనంతపురం కలెక్టరేట్:** జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ, భూ బదలాయింపు 15రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన జేసీ శివనారాయణశర్మతో కలిసి వివిధ ప్రాజెక్టులకు భూ సేకరణ, భూ బదలాయింపులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రైవేటు పరిశ్రమలకు సంబంధించి భూ సేకరణ, భూ బదలాయింపు చేపట్టాలన్నారు. ఆయా ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ విషయంపై ఆయా శాఖల అధికారులు ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. కొత్త భూ బదలాయింపు వస్తే ఎక్కడా ఫైల్ పెండింగ్ ఉండటానికి వీలులేదని, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ మలోల, కేఆర్‌సీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, కలెక్టరేట్ సెక్షన్ల సూపరింటెండెంట్లు యుగేశ్వరి దేవి, రియాజుద్దీన్, వసంతలత, నెడ్ క్యాప్ అధికారి కిషోర్‌కుమార్, ఏపీఐఐసీ మేనేజర్ శివమోహన్, బీఎస్ఎన్ఎల్ జేటీఎల్ రామకృష్ణ పాల్గొన్నారు.

ఫ్లాగ్‌డే సంక్షేమ నిధికి విరాళాలు ఇవ్వండి

కలెక్టర్ శ్యాంప్రసాద్

పుట్టపర్తి టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల ఫ్లాగ్‌డే సంక్షేమ నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయన సాయుధ దళాల ఫ్లాగ్‌డే సంక్షేమ నిధికి సంబంధించిన కారు పతాకాలు, స్టిక్కర్లను జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సైనికుల సేవలకు గుర్తింపుగా పౌరసమాజం ఇచ్చే గౌరవ చిహ్నంగా ఫ్లాగ్‌డే నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. కారు ఫ్లాగ్‌లు 5000, స్టిక్కర్లు 3500 అందుబాటులో ఉంచినట్లు ఉమ్మడి జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి పి.తిమ్మప్ప కలెక్టర్‌కి వివరించారు. కారు ఫ్లాగ్ ఒకటి ఐదు రూపాయలుగా, స్టిక్కర్ రెండు రూపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజలు వీటిని విరివిగా కొనుగోలు చేయాలని సూచించారు. సాయుధ దళాల పతాక దినోత్సవానికి విరాళాలు ఇవ్వదలచినవారు జిల్లా సైనిక్ సంక్షేమ అధికారి, అనంతపురం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా అకౌంట్ నంబర్ : 62076956433-ఐఎఫ్ఎస్‌సీ కోడ్-ఎస్‌బీఐఎన్0021438 ఖాతాకు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి సీహెచ్.పురుషోత్తం, సైనిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో వృద్ధ ఖైదీల విముక్తికి అవకాశం

డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్

కదిరి లీగల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా జైలులో ఉంటున్న వృద్ధులు లోక్ అదాలత్ ద్వారా విడుదలయ్యే అవకాశం ఉందని డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. కదిరి సబ్ జైలును శనివారం ఆయన తనిఖీ చేశారు. సబ్ జైలులో ఉన్న ఖైదీలకు అందుతున్న భోజనం, వైద్యం, సదుపాయాలను పరిశీలించారు. వారి కోసం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడారు. కేసులలో శిక్ష అనుభవిస్తున్న 70 ఏళ్ల దాటిన ఖైదీలకు లోక్ అదాలత్ ద్వారా విముక్తి లభించే అవకాశం ఉందని తెలిపారు. అలాంటివారు జైలులో ఉంటే.. జైలు అధికారికి, లేదా సందర్శనకు వచ్చే న్యాయవాదుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు. వారికి ఉచిత న్యాయవాదిని కోర్టు ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

ముస్లింల సమస్యల పరిష్కారానికే యూజేఏసీ

ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫి


మాట్లాడుతున్న కేఎం షకీల్ షఫి

అనంతపురం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ముస్లిం సామాజికవర్గ సమస్యల పరిష్కారం కోసమే యునైటెడ్ జాయింట్ యాక్షన్ కమిటీ(యూజేఏసీ)ని ఏర్పాటు చేస్తున్నట్లు ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫి పేర్కొన్నారు. జిల్లా కేంద్రం లక్ష్మీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి షకీల్ షఫి, మేయర్ వసీం, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌసమొద్దీన్, టీడీపీ ముస్లిం మైనార్టీ విభాగం నాయకుడు తాజుద్దీన్, కాంగ్రెస్ నాయకుడు దాదాగాంధీ, సీపీఐ నాయకుడు జాఫర్ హాజరయ్యారు. షకీల్ షఫి మాట్లాడుతూ ముస్లిం సామాజికవర్గ ప్రజలంతా ఏకతాటిపై నిలవాలని, ఏ ఒక్క ముస్లింకు సమస్య వచ్చిన ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. సీపీఐ నాయకుడు జాఫర్ మాట్లాడుతూ యూజేఏసీ అనేది ఒక వ్యక్తి లేదా పార్టీకి సంబంధించిన కమిటీ కాదని, ముస్లిం సామాజికవర్గం మొత్తానికి సంబంధించినదన్నారు. యూజేఏసీ జిల్లా కన్వీనర్‌గా జాఫర్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ముంతాజ్‌బేగం, ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్‌బాషా, హెల్పింగ్ హ్యాండ్స్ షబ్బీర్, మానవ హక్కుల జాకీర్ హుస్సేన్, ఆవాజ్ వలి, ముక్తియార్, బీజేపీ మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న సంచార జాతులు

ప్రజా సైన్స్ వేదిక కన్వీనర్ డాక్టర్ సురేష్‌బాబు


సంచార జాతులవారితో సురేష్‌బాబు

అనంతపురం టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల సంచార జాతులు కనుమరుగవుతున్నాయని ప్రజా సైన్స్ వేదిక కన్వీనర్ డాక్టర్ ఎం. సురేష్‌బాబు పేర్కొన్నారు. ఆ వేదిక జిల్లా కార్యాలయంలో శనివారం సంచార జాతుల వారితో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దాలుగా సంచార జాతులు ప్రభుత్వ పథకాల నుంచి, సామాజిక వనరుల నుంచి, రాజకీయ ప్రాతినిధ్యం నుంచి దూరంగా ఉంటున్నాయన్నారు. పలు తెగలు నేటికీ తీవ్ర నిర్లక్ష్యాన్ని ఎదుర్కొంటున్నాయన్నారు. వీటిలో కిన్నెర జోగులు ముఖ్యమైనవన్నారు. మహారాష్ట్ర నుంచి వలస వచ్చి, అనంతపురం జిల్లా కల్లూరు ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో తాత్కాలికంగా స్థిరపడిన ఈ సముదాయం ఒకప్పుడు సంప్రదాయ గాయకులు, కథకులు గా ప్రసిద్ధి చెందారని తెలిపారు. ఇపుడు వారి జీవితం అసంఘటిత కూలి పనులకు, పేదరికానికి, సామాజిక అజ్ఞానానికి పరిమితమైందని వాపోయారు. ఈ సముదాయాలకు కేవలం జీవనమే కాకుండా గౌరవప్రదమైన భవిష్యత్తు అవసరమన్నారు. వీరి సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించి, వారిని సామాజికంగా, ఆర్థికంగా నిలదొక్కునేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పౌర స్పందన వేదిక ప్రతినిధి ప్రొఫెసర్ వెంకటశివారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

నేడూ హౌసింగ్ సర్వే

అనంతపురం వైద్యం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పేదలకు సొంత స్థలం కేటాయింపు, కొత్త ఇల్లు మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన హౌసింగ్ సర్వే ప్రక్రియ ఆదివారం కూడా కొనసాగనుంది. ఈనెల 10నుంచి జిల్లాలో గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో సర్వేను నిర్వహిస్తున్నారు. శనివారం 48వేల కుటుంబాలను సర్వే నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ఈనెల 30వరకు ప్రభుత్వ గడువు విధించడంతో ఆదివారం సర్వే ప్రక్రియ ముగియనుంది. సర్వేలో పాల్గొనలేకపోయిన కుటుంబాలు వారి ప్రాంత సచివాలయాలకెళ్లి దరఖాస్తులు సమర్పించాలని జిల్లా గృహణ నిర్మాణ సంస్థ అధికారిణి శైలజ సూచించారు.

రేపు హ్యాండ్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హ్యాండ్‌బాల్ సీనియర్స్ ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలు సోమవారం ఎల్ఆర్‌జీ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి సాకే శివ శంకర్ తెలిపారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్‌కార్డు, యునిఫాం, క్రీడాసామగ్రితో హాజరు కావాలన్నారు. వివరాలకు సెల్ నంబర్లు 8978137522, 8074793673లను సంప్రదించాలని కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

పెనుకొండ రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు డీఆర్‌డీఏ, సీడప్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 19-26సంవత్సరాలు వయసు కలిగిన ఉమ్మడి జిల్లాకు చెందిన యువతకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 90రోజుల శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇవ్వనున్నారు. అనంతపురంలోని ఎస్‌కె యూనివర్సిటీలో ఆదివారం నుంచి శిక్షణ ప్రారంభం అవుతుందని ఆమె తెలిపారు.

బాబయ్య ఉరుసును విజయవంతం చేద్దాం

పెనుకొండ ఆర్డీఓ, డీఎస్పీ

పెనుకొండ టౌన్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన పెనుకొండ బాబయ్య 753వ ఉరుసు మహోత్సవాన్ని విజయవంతం చేద్దామని ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ నర్సింగప్ప పిలుపునిచ్చారు. ఉరుసు విషయంగా ఆర్డీఓ కార్యాలయంలో అన్నిశాఖల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబరు 2 నుంచి ప్రారంభమయ్యే ఉరుసు ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి అనేకమంది హాజరవుతారన్నారు. వీరికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఉరుసుకు వచ్చే సమయంలో 44వ జాతీయ రహదారిపై బైక్ రేసింగ్ జరగకుండా కట్టడి చేయాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ రాఘవన్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, రాజేష్, కమిషనర్ సతీష్‌కుమార్, మైనార్టీ నాయకులు దాదు పాల్గొన్నారు.

శుభకార్యాలకు మూఢం

ఫిబ్రవరి 17వరకు శుక్రమౌఢ్యమి

● అంతవరకూ ఆగాల్సిందే..



ధర్మవరం, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): శుభకార్యాలకు బ్రేక్ పడింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 17 వరకు దాదాపు 82 రోజులు శుక్రమౌఢ్యమి (మూఢం)కొనసాగనుందని పండితులు రాజేశ్ తెలిపారు. ఈ సమయాల్లో పెళ్లిళ్ల, గృహప్రవేశాలు, యజ్ఞాలు, కొత్తవ్యాపారాల ప్రారంభం తదితర పనులు చేయరాదని పండితులు చెబుతున్నారు. సాధారణంగా శుభకార్యాలు నిర్వహించాలంటే గురుబలం బాగా ఉండాలి. సిరిసంపదలు, సంతోషాలకు శుక్రబలం ఎక్కువగా ఉండాలి. శుక్రమౌఢ్యమి సమయంలో ఈ రెండు గ్రహాలు బలహీనంగా తేజస్సు కోల్పోయి ఉంటాయని అందుకే శుభకార్యాలు జరుపుకోవద్దని పండితులు సూచిస్తున్నారు.

పవిత్ర తిథులు

మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాల్లో శుభకార్యాలు అధికంగా జరుగుతాయి. ఈ ఏడాది మార్గశిరంలో ఒకటి, రెండుముహూర్తాలు ఉండగా పుష్యమాసం, శూన్యమాసం అవుతుంది. కనుక మాఘంలోనూ ఒక్క ముహూర్తం కూడా లేకపోవడం గమనార్హం. గృహ ప్రవేశాలకు అనుకూలమైన రథసప్తమి, సరస్వతి జన్మదినమైన వసంతపంచమి, మహామాఘిగా కీర్తింపడే మాఘపౌర్ణమి వంటి తిథులు ఈ సారి మూఢంలోనే ఉండటంతో శుభకార్యాలకు మంచిదికాదని పండితులు సూచిస్తున్నారు.

వ్యాపారులపై ప్రభావం

శుభకార్యాలు లేకపోతే వివాహ మండపాలు, ఫంక్షన్‌హాళ్లు, వస్త్ర, ఆభరణాల దుకాణాలు, స్వర్ణకారులు, క్యాటరింగ్, ఫోటో, వీడియో గ్రాఫర్లు, టెంట్‌హౌస్, పూలదుకాణాలు, లైటింగ్, డీజేలు, అద్దెకార్లు, బస్సులు, సన్నాయి మేళం ఇలా సంబంధిత వర్గాలు నెలల కొద్ది నష్టపోవాల్సి వస్తుంది. పౌరోహిత్యంపై ఆధారపడ్డ వారికి గడ్డుకాలమే.

మూఢం అంటే..

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం ఒక గ్రహం సూర్యుడి కిరణాలలో కనుమరుగై పోవడాన్ని మౌఢ్యమి వాడుక భాషలో మూఢం(చీకటి)అని అంటారు. శుభకార్యాలకు గురువు ఎంత ప్రధాన కారకుడో శుక్రుడు అంతే ప్రభావం కలవాడు. గ్రహశక్తులు బలహీనపడటంతో శుక్ర గ్రహం సూచించే ఫలితాలు అంతగా అనుకూలంగా ఉండవు. శుక్రుడు బలహీనం అయితే సంబంధాలు, వివాహ జీవితం, ఆర్థిక స్థిరత్వంలో ప్రతికూలతలు ఏర్పడతాయని జ్యోతిష్యులు చెబుతున్నారు. అందుకే శుక్ర మౌఢ్యం ఉన్న కాలంలో శుభకార్యాలు జరిపించడం శుభ సూచికం కాదని సూచిస్తున్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

జగదీశ్ చంద్రబోస్ (జయంతి)



'ఫాదర్ ఆఫ్ బెంగాలీ సైన్స్ ఫిక్షన్'గా పేరొందిన 'సర్ జగదీశ్ చంద్రబోస్ 1858 నవంబరు 30న బిక్రంపూర్ (ప్రస్తుతం బంగ్లాదేశ్) లో జన్మించారు. బయోలజిస్ట్, ఫిజిస్ట్, బొటానిస్ట్‌గా రాణించారు. సైన్స్ ఫిక్షన్‌పై ఎన్నో వ్యాసాలు రాశారు. రేడియో మైక్రోవేవ్ ఆప్టిక్స్‌పై పరిశోధనలు చేశారు. మొక్కల ఎదుగుదలకు సంబందించి 'క్రెస్కోగ్రాఫ్' అనే పరికరాన్ని ఆవిష్కరించారు. పరిశోధనలకోసం ప్రత్యేకంగా ఇన్‌స్టిట్యూట్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశం నుంచి 1904లో అమెరికాదేశపు పేటెంట్ పొందిన తొలి వ్యక్తి. 1937 నవంబరు 23న కన్నుమూశారు. ఆయన సేవలకుగాను బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ 50యూకే పౌండ్ కరెన్సీపై ఆయన చిత్రం ఏర్పాటు చేసింది.

విన్‌స్టన్ చర్చిల్ (జయంతి)



సాహిత్యంలో నోబెల్ ప్రైజ్ అందుకున్న 'సర్ విన్‌స్టన్ లియోనార్డ్ స్పెన్సర్ చర్చిల్ 1874 నవంబరు 30న ఆక్స్‌ఫర్డ్ షైర్‌లో శ్రీమంత కుటుంబంలో జన్మించారు. 1940-45 మధ్యన రెండో ప్రపంచయుద్ధ సమయంలో యునైటెడ్ కింగ్‌డమ్‌కు ప్రధానిగా వ్యవహరించారు. అనంతరం 1951-55మధ్యన కూడా ప్రధానిగా కొనసాగారు. కన్సర్వేటివ్ పార్టీలో సుదీర్ఘకాలం కొనసాగారు. బ్రిటీష్ స్టేట్స్‌మన్, ఆర్మీ ఆఫీసర్, రచయితగాను రాణించారు. సంఘ సంస్కర్తగా, జంతుప్రేమికుడిగా పేరొందారు. 1965 జనవరి 24న కన్నుమూశారు.

గురజాడ అప్పారావు (వర్ధంతి)



సంఘ సంస్కర్త, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన అభ్యుదయ కవితా పితామహుడు, రచయిత గురజాడ అప్పారావు 1862 సెప్టెంబరు 21న అప్పటి విశాఖపట్నం జిల్లా (ప్రస్తుతం అనకాపల్లి జిల్లా) ఎలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో జన్మించారు. రచనల ద్వారా సమాజంలో మార్పుకు కృషి చేశారు. 'కన్యాశుల్కము' నాటకం సాహితీ లోకంలో పేరొందింది. ఈ నాటకం కన్నడ, ఫ్రెంచ్, రష్యన్, ఇంగ్లీషు (2సార్లు), తమిళం, హిందీ (2సార్లు) అనువాదమైంది. సాహిత్యంలో వాడుకభాష ఒరవడికి కృషి చేశారు. కవిశేఖర బిరుదాంకితులు. 1915 నవంబరు 30న కన్నుమూశారు.

వాణీ జయరాం (జయంతి)



నేపథ్య గాయని, పద్మభూషణ్ వాణీ జయరాం 1945 నవంబరు 30న తమిళనాడు రాష్ట్రం వేలూరులో జన్మించారు. అసలు పేరు కలైవాణి. సినీ నేపథ్య గాయనిగానే కాకుండా అనేక భారతీయ భాషలలో భక్తిగీతాలు, ప్రైవేట్ ఆల్బమ్స్‌కు పాటలు పాడారు. నాలుగు దశాబ్దాలలో వెయ్యి సినిమాలకుపైగా 20వేల పాటలు పాడారు. ఉత్తమ నేపథ్య గాయనిగా మూడు జాతీయ ఫిల్మ్ అవార్డులు, ఇతర పురస్కారాలు పొందారు. 2023 ఫిబ్రవరి 4న కన్నుమూశారు.

'సిరివెన్నెల' సీతారామశాస్త్రి (వర్ధంతి)



సినిమా పేరునే ఇంటి పేరుగా పేరొందిన 'సిరివెన్నెల' సీతారామశాస్త్రి విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో 1955 మే 20న జన్మించారు. గీత రచయితగా 'సిరివెన్నెల' సినిమాతో సినీరంగప్రవేశం చేసిన చేంబోలు సీతారామశాస్త్రి, పద్మశ్రీ పురస్కార గ్రహీత. సిరివెన్నెలలోని 'విధాత తలపున' పాట ఆయన జీవితాన్నే మార్చేసింది. లలితగీతాలు రాయడంలోనూ ఉపద్రష్టులు. ఉత్తమ గేయ రచయితగా పదికిపైగా నంది అవార్డులు, దక్షిణాది ఫిల్మ్‌ఫేర్, కళాసాగర్, భరతముని, వంశీ బర్కిలీ పురస్కారాలు ఇతర గౌరవాలు అందుకున్నారు. 2021 నవంబరు 30న కన్నుమూశారు.

శోభారాజు (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత శోభా రాజు 1957 నవంబరు 30న ఉమ్మడి చిత్తూరు జిల్లా వాయల్పాడులో జన్మించారు. భక్తి గీతాల గాయనిగా, రచయిత్రిగా, సంగీత దర్శకురాలిగా రాణించారు. ప్రత్యేకించి అన్నమాచార్య సంకీర్తనల ఆలాపనలో పేరొందారు. 'అన్నమాచార్య భావన వాహిని'ని ఏర్పాటు చేశారు. 16వ యేటకే ఆలిండియా రేడియోలో కళాకారిణిగా చేరారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు సలహాదారురాలిగాను, సంగీత సాంస్కృతిక రంగాలలో పలు హోదాలలో కొనసాగారు. ద్వారకా తిరుమల దేవస్థానంచే ఆస్థాన విదూషిగా గుర్తింపు పొందారు. 'వెంకటేశ్వర గీత మాలిక' ఆడియో ఆల్బమ్ ఎంతగానో పేరొందింది. పలు బుల్లితెర ప్రదర్శనలు, ధారావాహికలకు దర్శకత్వం వహించారు. గౌరవ డాక్టరేట్, రాష్ట్ర ప్రభుత్వంచే ఉగాదికి హంస పురస్కారం, ఇతర గౌరవాలు పొందారు.

గంజాయి స్వాధీనం

శిడ్లఘట్ట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కారులో గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారనే సంచారంతో పోలీసులు దాడులు చేశారు. శిడ్లఘట్ట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జే వెంకటాపుర వద్ద తనిఖీలు చేశారు. కారులోని 30 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారును కూడా సీజ్ చేసి కేసు నమోదు చేసుకున్నారు. ఘటనా స్థలాన్ని ఎస్పీ కుశాల్ చౌక్సి పరిశీలించారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

కన్నడ వాడకం పెరగాలి : ఎమ్మెల్యే

దొమ్మసంద్ర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కన్నడ భాష వాడకం మరింత పెరగాల్సి ఉందని వక్తలు పేర్కొన్నారు. దొమ్మసంద్ర గ్రామంలోని ధర్మసాగర విద్యాసంస్థ ఆవరణలో కన్నడ రాజ్యోత్సవంలో ఆనేకల్ ఎమ్మెల్యే బీ శివణ్ణ మాట్లాడుతూ కన్నడ భాష వాడకంపై విద్యార్థులలో ప్రతిజ్ఞ చేయించాల్సి ఉందన్నారు. సోషల్ మీడియాలోనూ ఆంగ్ల వాడకానికి బదులు కన్నడ వాడకం పెరగాలన్నారు. పాఠశాల, కళాశాలల్లో నిర్వహించే కన్నడ రాజ్యోత్సవ కార్యక్రమాలు కేవలం సాంస్కృతిక ప్రదర్శనలకే పరిమితం అవుతున్నా యన్నారు. కన్నడ భాష ప్రాధాన్యత, సంస్కృతి, పరంపరపై అవగాహన పెరగాలన్నారు. విద్యార్థి దశలోనే వారికి సరైన మార్గదర్శకం ఉండాలన్నారు. భావితరాలకు కూడా కన్నడ సంస్కృతి పరంపరను అందించేబాధ్యత అందరిపై ఉందన్నారు. తాను, తన సోదరి కూడా ఈ పాఠశాలలోనే చదువుకున్నామని గుర్తు చేసుకున్నారు. ధర్మసాగర విద్యాసంస్థ కోశాధికారి డాక్టర్ డీవీ ధనరాజు మాట్లాడుతూ కన్నడ రాజ్యోత్సవాన్ని కేవలం ప్రభుత్వ సంఘసంస్థలు మాత్రమే ఆచరించడం సరికాదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఒక్క కన్నడిగుడు సంబరంగా కన్నడ రాజ్యోత్సవం ఆచరించాల్సి ఉందన్నారు. విద్యార్థులలో కర్ణాటక రాష్ట్ర గొప్పదనం, మాతృభాషపై అభిమానం పెంచేలా ప్రోత్సహించేలా కన్నడ రాజ్యోత్సవం నిర్వహించాలన్నారు. తొలుత విద్యార్థుల బృందంచే వీరగాసె, డొళ్ళుకుణిత నృత్యాలతో కన్నడమాత చిత్రపటంతో పురవీధులలో



కన్నడ రాజ్యోత్సవంలో ఎమ్మెల్యే శివణ్ణ తదితరులు

ఊరేగారు. వివిధరంగాలలో సేవలందించినవారిని గౌరవించారు. కార్యక్రమంలో కసాప గౌరవ కార్యదర్శి డాక్టర్ బీఎం పాటిల్‌పాండు, ధర్మసాగర విద్యాసంస్థ సీనియర్ డైరెక్టర్ డీసీ మనోహర్, ఉపాధ్యక్షుడు అశ్వత్ నారాయణరెడ్డి, కార్యదర్శి బీవీ శాంతకుమార్, డైరెక్టర్‌లు జగన్నాథ్, సురేశ్, కృష్ణప్ప, 1990, 1993 బ్యాచ్ సీనియర్ విద్యార్థుల చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కేశవ్‌బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంలో ఉద్యమశీలత కీలకం



ప్రెసిడెన్సీ స్నాతకోత్సవంలో ప్రముఖులు

బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ఉద్యమశీలత (ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్) కీలకమని ప్రతి యువకుడు కలలను సాకారం చేసుకునేందుకు ధైర్యం చేయాలని ప్రముఖ నిర్మాత, ఆన్‌లైన్ ఉన్నత విద్యావేదిక

ప్రెసిడెన్సీ స్నాతకోత్సవంలో రోనిస్ర్క్యూవాలా

అప్‌గ్రాడ్ కోఫౌండర్ రోనిస్ర్క్యూవాలా అభిప్రాయపడ్డారు. శనివారం ప్రెసిడెన్సీ యూనివర్సిటీ ఎనిమిదో స్నాతకోత్సవం జరిగింది. చాన్స్‌లర్ డాక్టర్ నిసార్ అహ్మద్, సంస్థాపక ట్రస్టీ కౌర్ నిసార్ అహ్మద్‌ల అధ్యక్షతన స్నాతకోత్సవం జరిగింది. 3686 మందికి డిగ్రీ పట్టాలు, 1233 మందికి పీజీ పట్టాలు, 34మందికి పీహెచ్‌డీ, 32మందికి బంగారు పతకాలను ప్రదానం చేశారు. మొత్తంగా 4953 మంది విద్యార్థులకు పట్టాల ప్రదానం జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ పాత్రికేయుడు దిలీప్ ఠాకూర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తును రూపొందించుకోవడంతోపాటు దేశానికి కొత్త శక్తినిచ్చే నైపుణ్యాతను విద్యాసంస్థలనుంచి నేర్చుకోవాలన్నారు. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ తిరువేంగడం, రిజిస్ట్రార్ సమీనా నూర్ అహ్మద్ అనాలిలు పాల్గొన్నారు. ప్రెసిడెన్సీ వైస్‌ప్రెసిడెంట్ సుహైల్ అహ్మద్, గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వైస్‌ప్రెసిడెంట్ డాక్టర్ నఫీజా అహ్మద్‌లు పాల్గొన్నారు.

కొడతి విద్యార్థులకు డిజిటల్ సహకారం

బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని కొడతి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు వర్చువల్ రియాలిటీ ఆధారంగా వే ఫర్ లైఫ్ ఎన్‌టీటీ డేటా డిజిటల్ సహకారం అందించనున్నట్టు ప్రకటించింది. వే ఫర్ లైఫ్ సంస్థ ప్రతినిధులు, విద్యానిపుణులు, పాఠశాల కమిటీ సభ్యుల సహకారంతో విద్యార్థులలో నేర్చుకునే ఆసక్తి, పాఠ్యాంశాలపై లోతైన అవగాహన, డిజిటల్ విధానంతో బోధనలు కల్పించేందుకు వర్చువల్ రియాలిటీ రూంను ఏర్పాటు చేశామని ప్రకటించారు. విద్యార్థులలో కొత్త ఆలోచనలు తీసుకురావాలన్నదే మా ఆశయమని వే ఫర్ లైఫ్ సంస్థ సంస్థాపకులు ఉదయ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. సమాజంలో వెనుకబడిన ప్రాంతాల విద్యార్థులకోసం తమ సంస్థ పని చేస్తోందన్నారు. ఎన్‌టీటీ డేటా సర్వీస్ గ్లోబల్ సీఎస్‌ఆర్ సీనియర్ డైరెక్టర్ గౌరి



వర్చువల్ రియాలిటీ రూంలో విద్యార్థులు, సంస్థ ప్రతినిధులు

బహాళ్కర్ మాట్లాడుతూ గుణాత్మకమైన విద్య, అందరికీ డిజిటల్ నైపుణ్యత అందించాలన్నదే మా ఆశయమన్నారు.

తాలూకాస్థాయి క్విజ్ పోటీలు



క్విజ్ పోటీల పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

బాగేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తాలూకా కన్నడసాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో పట్టణంలోని రీసోర్స్ సెంటర్‌లో కన్నడ క్విజ్ లిఖిత పరీక్షా పోటీలు శనివారం సాగాయి. బీఈఓ వెంకటేశప్ప పోటీలను ప్రారంభించి మాట్లాడుతూ 70వ కన్నడ రాజ్యోత్సవాన్ని పురస్కరించుకుని కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో పోటీలు సాగుతున్నాయన్నారు. కన్నడ నేల, నీరు, భాష, కళలు, సంస్కృతి, సాహిత్యంపై అవగాహన పెంచేలా క్విజ్ పోటీలను తాలూకా కసాప ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారన్నారు. పట్టణం, హోబళిస్థాయి హైస్కూల్ విద్యార్థులు సుమారు 80మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారు. విజేతలకు పుస్తకాలను, ప్రశంసాపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో సాక్షరతా విభాగం శివప్ప, టీపీఓ రంగనాథ్, ఈసీఓ పద్మావతి, మంజునాథ్, కసాప మహిళా ప్రతినిధి జ్యోతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కన్నడ నేర్చుకోవాలంటూ వాకథాన్

బెంగళూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కన్నడ రాజ్యోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేసిన వాకథాన్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 500మంది విద్యార్థులు వాకథాన్‌లో పాల్గొనగా కృష్ణ గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ రుక్మాంగదనాయుడు జెండా ఊపి ప్రారంభించారు. ప్రిన్సిపాల్ పద్మనవనీత్ ఆధ్వర్యంలో వాకథాన్ సాగింది. విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని కన్నడ కలి-నలి అంటూ నినాదాలు చేశారు. వైస్ ప్రిన్సిపాల్ లీలావతి, హెడ్ మిస్ట్రెస్ వనిత, కో-ఆర్డినేటర్ జయశ్రీలతోపాటు అధ్యాపకులు భాగస్వామ్యులయ్యారు. వాకథాన్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని నినాదాలు చేశారు. కన్నడ కార్యక్రమాలు మరింత విరివిగా నిర్వహిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు.



వాకథాన్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు

విద్యార్థులకు రాతసామగ్రి పంపిణీ

మహదేవపుర, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): కన్నడ రాజ్యోత్సవంలో భాగంగా శనివారం విద్యార్థులకు రాతసామగ్రి పంపిణీ చేశారు. కన్నడ నాడు-నుడిపై అభిమానం, సంస్కృతి గురించి తెలియచేసేలా కార్యక్రమం ఆచరించడం సంతోషంగా ఉందని టీకేఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు కిరణ్‌రెడ్డి పేర్కొన్నారు. హూడి - బసవణ్ణగర్ రోడ్డులోని భువనేశ్వరి ఆటోస్టాండ్ నాగరాజ్, ఆయన బృందం ఆధ్వర్యంలో కన్నడ జెండాను ఎగురవేశారు. కన్నడ మాత భువనేశ్వరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. విద్యార్థినీ విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్, నోటు పుస్తకాలు, రాత పరికరాలు, మహిళా ఉపాధ్యాయులకు పసుపు కుంకుమ, చీరలు అందచేశారు. కన్నడ సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ భావితరాలకు అందించాలని వక్తలు పిలుపునిచ్చారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సమాజసేవకుడు హూడి ప్రకాశ్‌బాబు, అశోక్‌రెడ్డి, నారాయణస్వామి, మంజునాథ్ పాల్గొన్నారు.



కన్నడ రాజ్యోత్సవంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేత

ఘనంగా కన్నడ రాజ్యోత్సవం

విజయపుర, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయపుర పట్టణంలోని బస్టాండ్‌లో కర్ణాటక రాష్ట్ర డాక్టర్ అంబేడ్కర్ రక్షణా సమితి ఆధ్వర్యంలో కన్నడ రాజ్యోత్సవం జరిగింది. అంబేడ్కర్ విగ్రహానికి, పవర్‌స్టార్ పునీత్‌రాజ్‌కుమార్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పురసభ అధ్యక్షురాలు భవ్యమహేశ్ పూలమాల వేసి పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం సంస్థాపక అధ్యక్షుడు శ్రీనివాస్, విజయపుర బ్లాక్ కాంగ్రెస్ యువ విభాగం అధ్యక్షుడు భానుచంద్ర, పురసభ సభ్యులు నందకుమార్, సైపుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



కన్నడ రాజ్యోత్సవంలో సంఘాల సభ్యులు, అభిమానులు

రోడ్లు, మురుగు కాలువ పనులకు శ్రీకారం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి

మహదేవపుర, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలలో మౌలిక సదుపాయాలు కల్పించి సమగ్ర అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి పేర్కొన్నారు. నల్లూరహళ్ళి, అంబేడ్కర్ గుట్ట, వర్తూరు, గుంజూరు, చిక్కబెళ్ళందూరు, మున్నెకొళలు సహా వివిధ లే అవుట్‌లలో అభివృద్ధి పనులకు శనివారం భూమిపూజ చేశారు. రోడ్డు, డ్రైనేజీ, నీటి వ్యవస్థలకు పనులు చేపట్టారు. ఈ సందర్భంగా హోబళి బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మారప్ప, మనోహర్ రెడ్డి, మహేంద్రమోది, బీఎస్ శ్రీధర్, నల్లూరహళ్ళి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

దళిత సంఘర్ష సేనకు పదాధికారులు

శిడ్లఘట్ట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దళిత సంఘర్షసేన తాలూకా విభాగానికి నూతన పదాధికారులు ఎంపికయ్యారు. పట్టణంలోని ఏపీఎం పార్టీహాల్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో నూతన పదాధికారుల వివరాలను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీ ఆనంద్ ప్రకటించారు. ఆనంద్ మాట్లాడుతూ దళిత సంఘర్ష సేన కేవలం ఒక వర్గానికి పరిమితం కాలేదన్నారు. అన్యాయాలపై పోరాటమే సంఘం ప్రధాన లక్ష్యంగా ఉందన్నారు. దళిత సంఘర్ష సేన జిల్లా, తాలూకా సమితి పదాధికారులుగా జిల్లాధ్యక్షులుగా నాగనరసింహ, జిల్లా కార్యాధ్యక్షుడిగా కే రవిశంకర్, కార్యదర్శి టీ పెద్దనహళ్ళి కృష్ణ, శిడ్లఘట్ట తాలూకా అధ్యక్షులుగా కే నారాయణస్వామి, కార్యాధ్యక్షులుగా హనుమంత ఎర కృష్ణప్ప తదితరులు ఎంపికైనట్టు ప్రకటించారు.



నూతన పదాధికారులు

అపోలో ఆయుర్వేదం ఆధ్వర్యంలో రేపు న్యూరోపై శిబిరం

బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అపోలో ఆయుర్వేద విభాగం ఆధ్వర్యంలో సోమవారం నరాల సమస్యలకు సంబంధించి ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేస్తోంది. ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం దాకా శిబిరం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. దొమ్మలూరు, హెచ్‌ఆర్‌బీఆర్ లే అవుట్, అరికెరె కేంద్రాలలో మూడుచోట్ల శిబిరాలు కొనసాగుతాయన్నారు. పార్కిన్సన్, పక్షవాతం వంటి సమస్యలపై వైద్య సలహాలు ఇవ్వనున్నారు. బుద్ధిమాంద్యం, తలనొప్పి, నరాల సమస్యలకు సంబంధించి న్యూరో నిపుణులు ఉచిత సలహాలు ఇవ్వనున్నారు. జీవనశైలి, ఒత్తిడిల వల్ల నరాల సమస్యలు తీవ్రమవుతాయని ఆరోగ్య సంరక్షణకు ఆయుర్వేద చికిత్సలు, సలహాలు ఇచ్చేందుకు అపోలో ప్రత్యేక శిబిరం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు.

అంతర్జాతీయ యోగా పోటీలకు సిరి

చింతామణి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని యోగాగురు నందిని ఎన్ గోవింద నేతృత్వంలో ఓజోని యోగాకేంద్రం విద్యార్థి ఆర్ సిరి 2026 జనవరి 16 నుంచి 21వరకు మలేషియా కౌలాలంపూర్‌లో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది. పాత్రికేయుడు రవిప్రకాశ్ కుమార్తె సిరి శనివారం మీడియా సమావేశంలో యోగా విన్యాసం చేశారు. ఈనెల 23న బెంగళూరులో అంతర్జాతీయ యోగా చాంపియన్‌షిప్‌లో ట్రెడిషినల్ చాంపియన్స్ పోటీల్లో ప్రథమ బహుమతి పొందినట్టు తెలిపారు. చాంపియన్ ఆఫ్ చాంపియన్స్ ట్రోఫీని అందుకున్నట్టు వివరించారు. సిరి యోగా విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివానంద తగడూరు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జేసీ లోకేశ్, జీసీ లోకేశ్, ఎం వాసుదేవ్‌హొళ్ళ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు మంత్రి పదవి ఖాయం

ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి విశ్వాసం



మీడియాతో ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి

బంగారపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభ శీతాకాల సమావేశాల తర్వాత మంత్రివర్గం పునఃవ్యవస్థీకరణ సాధ్యమని, అప్పుడు జిల్లాకు మంత్రి స్థానం లభించడం ఖాయమని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి తెలిపారు. పట్టణంలో శనివారం మీడియాతో మాట్లాడుతూ కోలారు జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి నలుగురు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు ఉన్నారన్నారు. హైకమాండ్, సీఎం సిద్దరామయ్య హామీ మేరకు ఈసారి మంత్రివర్గ పునఃవ్యవస్థీకరణ అయితే కోలారు జిల్లా ఎమ్మెల్యేకు అవకాశం ఇస్తారన్నారు. ఈ సందర్భంగా పురసభ మాజీ అధ్యక్షుడు కే చంద్రారెడ్డి, టీఏపీసీఎంఎస్ ఉపాధ్యక్షుడు అ.నా.హరీశ్, దరఖాస్తు సమితి సభ్యుడు గోవిందప్ప, చంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుమార్తెకు కిడ్నీ దానం చేసిన తండ్రి



కోలుకున్న తండ్రీకుమార్తెలతో వైద్యబృందం


బెంగళూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కన్నబిడ్డకోసం ఎంతటి త్యాగానికైనా తల్లిదండ్రులు సిద్ధంగా ఉంటారనేది తెలిసిందే. కుమార్తె వంశపారంపర్యంగా వచ్చే కిడ్నీ సమస్యతో బాధపడుతుండేది. వైట్‌ఫీల్డ్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో పరీక్షలకు వెళ్లగా కిడ్నీలు విఫలమయ్యాయని డాక్టర్లు గుర్తించారు. కిడ్నీ సమకూర్చడం అత్యవసరమని డాక్టర్లు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులలో ఎవరైనా ఉన్నారా... అని డాక్టర్లు ఆరా తీశారు. 61ఏళ్ల తండ్రి బీపీ, షుగర్ ఉన్నా ఇతరత్రా ఏ సమస్యలు లేకపోవడంతో మార్జినల్ డోనార్‌గా పరిగణించారు. తండ్రి కిడ్నీ దానం చేయడంతో సర్జరీని విజయవంతం చేశారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్టు సీనియర్ నెఫ్రాలజిస్ట్ హరీశ్ బాబు, యూరాలజిస్ట్, ట్రాన్స్‌ప్లాంటేషన్ నిపుణుడు డాక్టర్ ప్రమోద్, దిలీప్‌ల బృందం ప్రకటించింది. ఇదే విషయమై తండ్రి మాట్లాడుతూ నాకున్న ఏకైక కుమార్తె రోజురోజుకు ఆరోగ్యం విషమిస్తుండడంతో మరో ఆలోచన లేకుండా కిడ్నీ దానం చేశానన్నారు. 2013లో భార్యకు కిడ్నీ దానం చేయాలని భావించానని అయితే ఆపరేషన్ సమయంలో సాంకేతిక సమస్యలతో సాధ్యం కాలేదన్నారు. ప్రస్తుతం కుమార్తెకు కిడ్నీ ఇచ్చానని, ఇద్దరం ఆరోగ్యంగా ఉన్నామన్నారు.

నేమకల్లు అంజన్నకు పూజలు

బొమ్మనహాళ్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) మండలంలోని నేమకల్లు ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలు జరిగాయి. ప్రధాన అర్చకుల అనిల్ కుమార్ చార్యులు పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, వెండి కవచం, పుష్పాలంకరణ చేసి నైవేద్యం సమర్పించిన అనంతరం మహామంగళారతి ఇచ్చారు.







తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1623.06	1629.96
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	2,117	2,429
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	6,267	6,507
నీటి నిల్వ (టీఎంసీలు)	70.33	93.91



పట్టణంలో ఊరేగుతున్న అడ్డపల్లకి

వైభవంగా అడ్డపల్లకి ఊరేగింపు

కంప్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధి గాంచిన నీలమ్మ పేట బసవేశ్వరుడి అడ్డపల్లకి ఊరేగింపు శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో నీలమ్మదేవి పేట, బసవేశ్వరస్వామి పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి పట్టణంలో పూల పల్లకి భాజా భజంత్రీలతో వీధుల్లో ఊరేగించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. పూలు, పండ్లతో అమ్మవారికి, స్వామివారికి మొక్కులు సమర్పించుకున్నారు.



అలంకరణలో నీలమ్మదేవి

తెల్లారిన జీవితాలు

(5వ పేజీ తరువాయి)చికిత్స కోసం కర్నూలుకు తరలించారు.

కూలిన కలల సౌధం

సతీష్, మీనాక్షి ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ బెంగళూరులో స్థిరపడ్డారు. సంపాదించినదాంట్లో కొంత పోగు చేసి బెంగళూరులోనే నివాసం ఉండడానికి ఓ ఇంటిని కొనుగోలు చేశారు. ఆ సంతోషాన్ని తల్లిదండ్రులతో పంచుకొని మూడు రోజుల క్రితం తమ వివాహ వేడుకను జరుపుకొని బెంగళూరుకు వెళ్లేలోపు మంత్రాలయం రాఘవేంద్రస్వామిని దర్శనం చేసుకోవాలని మొక్కుకున్నారు. అందులో భాగంగానే కారులో భార్య, కొడుకు, అత్తా, మామ, అల్లుడితో కలసి సతీష్ కారులో రాత్రి పదిగంటలకు అత్తమామల స్వగ్రామం నుంచి మంత్రాలయానికి బయల్దేరారు. మధ్యమధ్యలో తీపిజ్ఞాపకాలను నెమరువేసుకుంటూ వారి ప్రయాణాన్ని సాగించారు. శనివారం ఉదయం దైవదర్శనం చేసుకొని తిరిగి సొంత గ్రామానికి చేరుకోవాలని రెండు రోజుల్లో బెంగళూరుకు వెళ్లి విధులకు వెళ్లాలని సతీష్, మీనాక్షి మాట్లాడుకున్నారు. చల్లగాలికి నిద్ర రావడంతో మాట్లాడుతూ.. మాట్లాడుతూ ఎవరి సీట్లలో వారు కునుకు తీశారు. సతీష్ ముందు సీటులో తన కుమారుడు రిత్విక్‌ను ఒడిలో కూర్చొ బెట్టుకున్నాడు. వెనక్కి సీటులో భార్య మీనాక్షి, తన అమ్మ, నాన్నలు, అన్న కుమారుడు బనిత్‌గౌడ్ కూర్చొని నిద్రలోకి జారుకున్నారు. ఒక గంటలో మంత్రాలయం రాఘవేంద్రస్వామి క్షేత్రానికి చేరుకోవాల్సిన వారు కారు ప్రమాదంలో కన్నుమూశారు.



రోడ్డు పక్కన ఉంచిన ఐదుగురి మృతదేహాలు

నాన్న ఒడిలోనే చివరిశ్వాస

ఏబిడ్డకైనా తన నాన్న ఒడి మృత్యు ఒడి అవుతుందా? కాదు.. కానీ చిన్నారి రిత్విక్ విషయంలో మాత్రం తన నాన్న ఒడే మృత్యు ఒడి అయింది. 'నాన్నా నేను అమ్మతో ఉండను. నీతోనే కూర్చుంటా' అంటూ గారాం చేసిన బాలుడు రిత్విక్‌ను తండ్రి చేరదీసి తన ఒడిలో పడుకోబెట్టుకుని జోకొట్టి నిద్రపుచ్చాడు. కుమారుడు నిద్రలోకి జారుకోగానే సతీష్‌కూడా కునుకు తీశాడు. ఘోర రోడ్డు ప్రమాదం జరిగి వీరు ప్రయాణిస్తున్న కారు, ఎదురుగా వస్తున్న కారు ఒకటికొకటి ఢీకొనడంతో కూర్చున్న చోటే తండ్రి కొడుకులు విగత జీవులయ్యారు. ఈ భయానక దృశ్యాన్ని చూసిన స్థానికులు 'అయ్యో పాపం.. దేవుడు ఎంత పనిచేశాడు.. పసికందులను సైతం తీసుకెళ్లాడు.. పాపం తండ్రి ఒడిలోనే ఆ కొడుకు చనిపోయాడు...' అంటూ కన్నీటి పర్యంతమయ్యారు.

బతికించిన ఎయిర్‌బ్యాగ్స్!

విశాఖపట్నానికి చెందిన అశోక్ చౌదరి.. భార్య రాధిక, కుమార్తె జాహ్నవితో కలసి ఆదోనికి బయలుదేరారు. వారి సమీప బంధువుల రిసెప్షన్ ఉండటంతో విశాఖ నుంచి విమానంలో హైదరాబాదు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆదోనికి చెందిన ఫార్చునర్ కారులో ఆదోనికి బయల్దేరారు. వీరి వాహనం ఆరేకల్లు, కొటేకల్లు మధ్యలోకి రాగానే ఎదురుగా వస్తున్న కర్ణాటక కారు ఒకటికొకటి ఢీకొన్నాయి. ఈ క్రమంలో కర్ణాటక కారులో ప్రయాణిస్తున్న ఐదు మంది మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. కాని వీరు ప్రయాణిస్తున్న ఫార్చునర్ కారుకు ప్రమాదం జరిగిన వెంటనే ఎయిర్‌బ్యాగ్స్ ఓపెన్ కావడంతో అందులో ప్రయాణిస్తున్న నలుగురు స్వల్ప గాయాలతో మాత్రమే బయటపడ్డారు.

సంఘటన చాలా బాధాకరం - ఎమ్మెల్యే బీవీ

మంత్రాలయం పుణ్యక్షేత్రం దర్శనార్థం వచ్చిన కర్ణాటక భక్తులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం చాలా బాధాకరమని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సహాయక చర్యలను ఆయన పరిశీలించారు.



దెబ్బ తిన్న కారు



హనుమాన్ మాల ధరించిన ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి

హనుమాన్ దీక్షలో ఎమ్మెల్యే గాలి

గంగావతి రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి శనివారం అనెగొంది లోని పంపా సర్వవర వద్ద హనుమమాల ధరించారు. స్వామికి వారి విశేష పూజలు నిర్వహించారు. డిసెంబర్ 3వ తేదీన అంజనాద్రి పర్వతంపై జరగనున్న హనుమమాల విసర్జన హోత్సవం గురించి వివరించారు. మూడు రోజులు హనుమంత జపం చేస్తూ హనుమాన్ చాలీసా చదువుతూ భక్తి సాధనలో పాల్గొంటారన్నారు. హనుమంతుడి దీవెనలు అందరికీ ఉండాలని పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఏటా హనుమాన్ దీక్షతో ఆంజనేయుడిని దర్శించుకుంటున్నటు తెలిపారు. అంజనాద్రి పర్వతం పవిత్ర క్షేత్రమై ఉండటంతో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలివస్తున్నారు. ఈసారి కుడా హనుమమాల విసర్జన రోజున భారీగా జనసందోహం ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా బందోబస్తు, పార్కింగ్, త్రాగునీరు, వైద్య సాయము వంటి ఏర్పాట్లును పకడ్బందీగా చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. పాదయాత్రగా వచ్చే భక్తులకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాలని, అంజనాద్రి కమిటీ భక్తులు దర్శనం పూర్తి చేసి మాల విసర్జన చేసుకునే వరకూ సమగ్ర పర్యవేక్షణ చేపట్టాలని ఆయన ఆదేశించారు.

ధ్యానంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న బ్రహ్మకుమారీలు

బళ్లారి సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హొసపేట చిత్తవాడ్గిలోని నర్మాద దేవి మెమోరియల్ స్కూల్(ఎన్ఎంఎస్) లో శుక్రవారం ఒక వినూత్న ప్రయత్నం జరిగింది. ఇక్కడ విద్యార్థులు వివిధ పాఠశాలల విద్యార్థులకు , సాధారణ ప్రజలకు అంతర్గత శాంతిపై అవగాహన కల్పించారు. హగరిబొమ్మనహళ్ళి నందిపుర క్షేత్రానికి చెందిన మహేశ్వర మహాస్వామీజీ నగరంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం కన్వీనర్ మానస అక్క ఈ కార్యక్రమంలో పాల్గొని ధ్యానం ప్రాముఖ్యత , మనశ్శాంతి గురించి వివరించారు. పాఠశాల ప్రాంగణంలో ఇటువంటి అంశాలపై ప్రదర్శన నిర్వహించడంలో పాఠశాల పరిపాలన కృషిని వారు ప్రశంసించారు. ధ్యానం, స్వీయ నియంత్రణ, చికిత్స దాదాపు 15 తరగతి గదుల్లో ప్రదర్శించారు. ఒక విద్యార్థి రాగి పాత్ర చుట్టూ కర్రలను ఊపడం ద్వారా శాంతి తరంగాలను సృష్టించే పురాతన పద్ధతిని ప్రదర్శించారు. యోగాద్వారా మనస్సు , శరీరాన్ని ఎలా బలంగా ఉంచుకోవాలో ప్రదర్శించారు. వివిధ పాఠశాలల నుంచి వేలాది మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల చీఫ్ అకడమిక్ అడ్వైజర్ అనురాధ ఈశ్వరన్, సీనియర్ ప్రిన్సిపాల్ విశాలాక్షి, ట్రస్ట్ సెక్రటరీ నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారుల నుంచి రక్షణ కల్పించండి

- లోకాయుక్త ఎస్పీకి బాధితుడు రమేష్ జోగిన్ వినతి



లోకాయుక్త ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న రమేష్ నాయక్ జోగిన్

గంగావతి రూరల్, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) పూర్వీకుల ఆస్తిపై కోర్టులో కేసు నడుస్తున్న నేపథ్యంలో ఆక్రమణదారుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని రమేష్‌నాయక్ జోగిన్ అనే బాధితుడు పిర్యాదు చేశారు. శనివారం స్థానిక తాలూకా పంచాయతీ మంథన్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు వచ్చిన లోకాయుక్త ఎస్పీ సతీష్‌కు ఆయన వినతిపత్రం అందజేశారు. గంగావతి నగర సర్వే నెంబర్ 46/ఏ లోని 16. 11 ఎకరాలు పూర్వీకుల భూమిపై 2021లో కేసు నమోదై కోర్టులో విచారణ జరుగుతోంది. అందులో ప్రభుత్వం టీడీపీ కోసం 1.33 ఎకరాల భూమిని ఇప్పటికే స్వాధీనం చేసుకుందని, అయితే 14. 18 ఎకరాల భూమిని పలుకుబడి కలిగిన రాజకీయ నాయకులు, ఇతరులకు అమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఆయన వాపోయారు. గవర్నర్, ముఖ్యమంత్రి, గంగావతి ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు పలు మార్లు నివేదించినా ఫలితం శూన్యమన్నారు. ఇప్పటికైనా పోలీస్ రక్షణ కల్పించాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కంప్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : గ్రామలు, పట్టణాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా కాపాడుకోవాలని కుడితిని పట్టణ పంచాయతీ సభ్యులు నళిని యాస్మిన్ సూచించారు. పట్టణంలో ని ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో వైద్యాధికారి శ్రీ ఓం ప్రకాష్, రసూల్ సాబ్, రవీంద్ర బాబు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, కుడితిని, జానెకుంటి, హరిగిణదోణి, వేణి వీరాపురం, బెళగల్, హోన్నళ్లి తండా, తిమ్మలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పల్స్‌పోలియో చుక్కలు ఎలా టేయాలి, టీకాలు ఎలా వేయాలనే దానిపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. బహిరంగ మల విసర్జన, పరిసరాల పరిశుభ్రం విషయంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం గురించి ప్రతి ఒక్కరూ మొదట వారి ఇళ్లనుంచి వేరు చేయాలన్నారు.

హోసూరు జోన్



ట్రాఫిక్‌జామ్‌తో ఆగిపోయిన వాహనాలు

నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ సమస్య

హోసూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): హోసూరు నగర ప్రాంతంలో రాయకోట రోడ్డులోని అశోక్‌పిల్లర్ సమీపాన కొన్ని వాహనాలు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం వల్ల ట్రాఫిక్ జామ్ వల్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కృష్ణగిరి జిల్లాలోని హోసూరు నగరంలో 3వేలకు పైగా కర్మాగారాలు ఉన్నాయి. కర్మాగారాలకు హోసూరు నుంచి కర్ణాటకకు అనుసంధానించబడి ఉండడంతో రెండు రాష్ట్రాలు అనుసంధానించబడ్డాయి. తమిళనాడు నుంచి మాత్రమే కాకుండా వివిధ ఇతర రాష్ట్రాల నుంచి కూడా కార్మికులు తమ కుటుంబాలతో కలిసి ఇక్కడి ఫ్యాక్టరీలలో పనిచేస్తున్నారు. హోసూరు నగరం ఉదయం వేళ హోసూరు, కర్ణాటకలోని వివిధ కర్మాగారాలకు వెళ్లే కార్మికులతో సందడిగా ఉంది. బస్టాండు నుంచి వివిధ కర్మాగారాల్లో పనిచేసే కార్మికులు రైతు బజారుకు వెళ్లడానికి, తాలూకా కార్యాలయానికి బాగలూరు రోడ్డును ఉపయోగిస్తారు. ఈ మార్గంలో పాదచారులు, వాహనదారులు నడవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిలో హోసూరును మునిసిపల్ కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ చేసినప్పటికీ రోడ్లు, భవనాలు, రవాణా సహా మౌలిక సదుపాయాలు విస్తరించబడలేదు. హోసూరు నగరంలో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి తగినంత ట్రాఫిక్ పోలీసులు లేరు. దీనివలన హోసూరులోని వివిధ ప్రాంతాలలో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎటువంటి దిశానిర్దేశం చేయబడలేదు. ఫలితంగా వివిధ పనులకు వెళ్లే కార్మికులు, రోగులను ఆసుపత్రులకు తీసుకెళ్లే అంబులెన్స్‌లు సకాలంలో చేరుకోలేక ప్రతిరోజూ ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా రాయకోట రోడ్డులోని అశోక్‌పిల్లర్ దగ్గర పోలీసులు లేనప్పుడు కొన్ని వాహనాలు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. కృష్ణగిరి నుంచి బెంగళూరుకు ఇన్నర్ రింగ్ రోడ్డులో వేళ్లే వాహనాలకు, ధర్మపురి రాయకోట నుంచి హోసూరు మీదుగా బెంగళూరుకు వెళ్లే వాహనాలకు ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో అశోక్ పిల్లర్ వద్ద పోలీసులను కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఇళ్ల ముందు పార్కు చేసిన వాహనాలు చోరీ



వాహనాలను చోరీ చేస్తున్న దుండగులు

హోసూరు(క్రైం), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హోసూరు పట్టణ ప్రాంతంలోని ఇళ్లు, నివాస ప్రాంతాలలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు రాత్రివేళ దొంగలించబడుతున్న సంఘటనలు అధికమవుతున్నాయి. హోసూరులోని రాయకోట రోడ్డులోని త్రివేణి గార్డెన్ నివాస ప్రాంతంలో నివసించే ప్రజలు సాధారణంగా తమ ఇళ్ల ముందు తమ వాహనాలను పార్కింగ్ చేస్తారు. అనుమానాస్పద వ్యక్తులు పార్కింగ్ ప్రాంతంలో పార్క్ చేసిన మూడు ఖరీదైన వాహనాలను చోరీ చేసిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీల ద్వారా వెల్లడయ్యాయి. దీంతో ప్రజలు షాక్‌కు గురవుతున్నారు. మూడు ద్విచక్ర వాహనాల్లో రెండింటిని దుండగులు సులభంగా దొంగిలించగా, ఒక వాహనంలో పెట్రోల్ లేకపోవడంతో దానిని ఆ ప్రాంతంలోనే వదిలివేశారు. స్థానికులు హోసూరు నగర పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

బాల్యవివాహ నిషేధ చట్టంపై అవగాహన

హోసూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): హోసూరులోని అదియమాన్ పాలిటెక్నిక్ కళాశాలలో బాల్యవివాహ నిషేధ చట్టంపై అవగాహన కార్యక్రమం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ ప్రకాశ్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. తమిళ అధ్యయన విభాగంలో లెక్చరర్ జస్టినా ప్రధానవక్తగా వ్యవహరించారు. కార్యక్రమంలో బాల్య వివాహాల ప్రభావాలను, నిషేధ చట్టాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులచే బాల్యవివాహ నిషేధ చట్టంపై ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు సందరం, విజయలక్ష్మి, సంతోష్, అసిస్టెంట్ సుబ్రహ్మణి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ బాలాజీ ప్రకాశ్ నేతృత్వంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

రెండో రోజుకు ఎన్ఎండీసీ కార్మికుల సమ్మె



ఎన్ఎండీసీ ప్లాంట్ ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

బళ్లారి సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): సండూరు తాలూకాలోని ఎన్ఎండీసీ పెల్లెట్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె రెండవ రోజుకు చేరుకుంది. శనివారం ఎన్ఎండీసీ ప్లాంట్ ప్రధాన ద్వారం ముందు వందలాది మంది కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా యునైటెడ్ మైన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏఐయూటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సోమశేఖర్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులను తిరిగి పనిలోకి తీసుకునే వరకు పోరాటం ఐక్యంగా ముందుకు సాగుతుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వెనక్కి తగ్గకూడదు మన బలం పెరగాలి, పోరాటాన్ని తప్పుదారిపట్టించే శక్తులపట్ల మనం జాగ్రత్తగా ఉండాలన్నారు. అదేవిధంగా గ్రామస్థుల మద్దతును పొందడం ద్వారా పోరాటాన్ని సరైన దిశలో తీసుకెళ్లి విజయం సాధిస్తామన్నారు నాయకులు ఏ.దేవదాస్, డాక్టర్ ప్రమోద్, సురేశ్, హులిగేశ్, మంజునాథ్, సంతోష్ , వీరేశ్, నాగేశ్, హులియప్ప తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కేంద్రం సహకరించాలి

- బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్



వార్షిక సర్వసభ్య సమావేశంలో బళ్లారి వాణిజ్య పరిశ్రమల సంఘం సభ్యులు

బళ్లారి సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలో జరిగిన భారత సంఘాల సమాఖ్య 98వ వార్షిక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల సంఘం జిల్లాలో ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఢిల్లీలో జరిగిన సదస్సులో బళ్లారి జిల్లా వాణిజ్య పరిశ్రమల మండలి అధ్యక్షుడు అవ్వారు మంజునాథ్ , గౌరవ కార్యదర్శి సురేశ్‌బాబు నేతృత్వంలో జరిగిన రెండు రోజుల సమావేశంలో పాల్గొన్నారు. తుంగభద్ర జలాశయం క్రస్ట్ గేట్ల ఏర్పాటు, విమానాశ్రయం, రైల్వే అభివృద్ధి, కొత్త రైల్వేలైన్ల ప్రారంభం, జాతీయ రహదారుల అభివృద్ధి , కొత్త పరిశ్రమల ప్రారంభం, వ్యాపార వ్యవస్థాపక పెట్టుబడిదారులకు అనుకూలమైన విదానాలు, చట్టాల అమలు , పన్ను సరళీకరణ వంటి వివిధ ప్రాథమిక సౌకర్యాల అమలు కోసం విజ్ఞప్తి చేశారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని కేంద్రప్రభుత్వంపై సంబంధిత శాఖ మంత్రులు, అధికారులపై ఒత్తిడి తీసుకురావాలని ఆయన ఇండియన్ చాంబర్స్ సమాఖ్యకు విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ అధ్యక్షుడు హర్షవర్ధన్ అగర్వాల్, ఎన్నికైన అధ్యక్షురాలు అనంత్ గోయెంకా,ఎఫ్‌కేసీసీఐ బెంగళూరు అధ్యక్షురాలు శ్రీమతి ఉమారెడ్డి, కర్ణాటక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షురాలు అడప్పగౌడ, బళ్లారి చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మాజీ అధ్యక్షుడు యశ్వంత్‌రాజ్ నాగిరెడ్డి, దొడ్డనగౌడ, జాయింట్ సెక్రటరీలు రామచంద్ర, కోశాధికారి నాగల్లి రమేశ్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

'పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి'

కంప్లి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : గొర్రెల కాపరులు సంస్థలు ఏర్పాటు చేసే ఆరోగ్య శిబిరాలను సద్వినియోగపరచుకోవాలని పశు వైద్యులు వీరేష్ సూచించారు. శనివారం కుడితిని సమీపంలోని అడవుల్లో సిద్ధమ్మనహళ్లి, తిమ్మలాపురం, వేణి వీరాపురం గ్రామాల్లో గొర్రెలకు, పశువులకు అదానీ సంస్థ ఆధ్వర్యంలో చికిత్స నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం మూడు గ్రామాల గొర్రెల కాపరులు మాట్లాడుతూ అదానీ సంస్థ ద్వారా తాము ఎన్నో సదుపాయాలు పొందామని తెలిపారు. ఇలాంటి సమయంలో కాపరులకు అండగా నిలిచి గొర్రెలకు, పశువులకు చికిత్స అందించి అండగా నిలిచారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిజ్వాన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న అదానీ సంస్థ ప్రతినిధులు

పరిశోధనలతో విద్యార్థులు విజ్ఞానం పెంచుకోవాలి

- వీఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ దినేశ్

బళ్లారి సిటీ, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): విద్యా పరిశోధనలో పాల్గొని విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలని, ఉపన్యాసాల్లో విద్యార్థులు పాల్గొనడం వల్ల జ్ఞానం పెరుగుతుందని విజయనగరం శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దినేశ్ అన్నారు. విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగంలో రసాయన శాస్త్రాల్లో ఇటీవలి ధోరణులపై రెండు రోజుల పూర్వ విద్యార్థుల ఉపన్యాస శ్రేణి కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉపన్యాసాల ద్వారా విద్యార్థులు సమగ్ర వాతావరణాన్ని అందించగలరన్నారు. విద్యార్థుల చురుకైన భాగస్వామ్యంతో వారు ప్రస్తుత విద్యార్థి , సంస్థ అభివృద్ధికి కృషి చేయగలరన్నారు. సమాజానికి విద్యా సేవలను అందించడం ద్వారా వారు బాధ్యతాయుతమైన స్థానాన్ని పొందగలరన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం విద్యార్థులకు , విద్యాసంస్థకు మధ్య బలమైన బంధాన్ని ఏర్పరచడంలో సహాయపడుతుందన్నారు. రిజిస్ట్రార్ ఎం.సాలి మాట్లాడుతూ విద్యార్థుల మధ్య ఆలోచనల మార్పిడికి ఇది తగిన వేదికను అందిస్తుందన్నారు. విద్యా పురోగతితో పాటు దేశాన్ని రూపొందించడంలో కూడా సహాయపడుతుంద న్నారు. ఈకార్యక్రమంలో ప్యూర్ సైన్సెస్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఉదయ కుమార్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ లోకేశ్, కన్వీనర్ డాక్టర్ సాదు సూర్యకాంత,ప్రొపేసర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. ఉపన్యాస శ్రేణిలో వంద మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ దినేశ్